తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 145

ఆదివారం 26, అక్టోబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥


## చొరబాటుదారులను ఉపేక్షించేది లేదు



- బీహార్ ప్రచారంలో అమిత్ షా స్పష్టీకరణ

**పాట్నా,అక్టోబర్25(అక్షర గళం):** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఖగడియా జిల్లాలో అధికార, ప్రతిపక్ష నేతలు నేడు పోటాపోటీ ప్రచార సభలు నిర్వహించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ను వ్యతిరేకించిందంటూ 'ఇండియా' కూటమిపై కేంద్రమంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వదేశానికి తరలిస్తామన్నారు. బిహార్‌లో జంగల్‌రాజ్ తిరిగి వస్తుందా? లేదా రాష్ట్రం అభివృద్ధి మార్గంలో మిగతా.. 2లో




# హైదరా'బాద్‌షా' మనమే కావాలి!

- హైదరాబాద్ నగరానికి మనం చేసిన సేవలను అభివృద్ధిని గుర్తు చేయాలి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై హైదరాబాద్ నాయకులతో కేటీఆర్ ప్రత్యేక సమావేశం
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో సమావేశం

**హైదరాబాద్,అక్టోబరు25 (అక్షరగళం):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నాయకులందరూ కలిసికట్టుగా పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో భారత రాష్ట్ర సమితికి (బీఆర్ఎస్) ఉన్న అపూర్వమైన బలాన్ని ఈ ఉప ఎన్నికలో చాటాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. "హైదరాబాద్ నగర ప్రజలు మన పార్టీ పట్ల అద్భుతమైన నమ్మకాన్ని చూపించి వందకు వందశాతం సీట్లను గత ఎన్నికల్లో మన పార్టీకే కట్టబెట్టారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి" అని ఆయన అన్నారు. మిగతా.. 2లో

# 14వేల అంగన్వాడీ టీచర్ హెల్పర్ల నియామకం

- గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లకు నియామక పత్రాల అందచేత
- వెల్లడించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్,అక్టోబర్25 (అక్షరగళం):** త్వరలో 14వేల అంగన్వాడీ టీచర్ హెల్పర్ల నియామకాన్ని చేపట్టబోతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమాన్ని తమ ప్రభుత్వం ప్రాధాన్యతగా ఎంచుకుందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఎన్నో సవాళ్లు ఉన్నా ఆకాశాన్ని చీల్చుకొని అంతరిక్షం వరకు మహిళలు చేరుకుంటున్నారని ఉద్ఘాటించారు. ఐసీడీఎస్ సేవలకు భారతదేశంలో దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రాణం పోశారని నొక్కిచెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలని శనివారం మంత్రి సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో మంత్రి సీతక్క ముచ్చటించారు. ఈరోజు 181 మంది సూపర్‌వైజర్లుగా నియామక పత్రాలు అందుకున్నారని చెప్పుకొచ్చారు. వేల మందితో పోటీపడి మీరు ఈ కొలువులు సాధించారని తెలిపారు. మీ నిరీక్షణలు ఫలించాయని అన్నారు. మీ ఉద్యోగ కలలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని ఉద్ఘాటించారు. ప్రజల ఆశలు, అవసరాల మేరకు మీ వృత్తి ధర్మం ఉండాలని సూచించారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీ ప్రతి మహిళకు గౌరవం, ప్రతి చిన్నారికి సంరక్షణ ఉండాలనే లక్ష్యంతో ఐసీడీఎస్ సేవలను, అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారని గుర్తుచేశారు. అంగన్వాడీ కేంద్రాలకు తెలంగాణలోనే మొదటిసారిగా ప్రారంభించారని వివరించారు. 1970లో మహబూబ్‌గర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అంగన్వాడీ సేవలను ప్రారంభించారని తెలిపారు. అక్కడ సక్సెస్ కావడంతో దేశవ్యాప్తంగా అంగన్వాడీ సేవలను ఇందిరా గాంధీ విస్తరించారని పేర్కొన్నారు మంత్రి సీతక్క.'అంగన్వాడీ హెల్పర్ నుంచి మహిళా శాఖ సెక్రెటరీ వరకు ఈరోజు కొలువులు ఉన్నాయంటే అదంతా ఇందిరాగాంధీ చలువే. అందుకే ప్రతి ఒక్క మహిళ ఇందిరా గాంధీకి రుణపడి ఉండాలి. మన రాష్ట్రంలో మిగతా.. 2లో



# కుట్రజేసి నన్ను గెంటేశారు..!

- మీ ఆశీర్వాదం కోసం మీ ముందుకు వచ్చా....
- 'జాగృతి జనంబాట'లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణ

**హైదరాబాద్,అక్టోబరు25(వార్తవేదికసూర్య):** నిజామాబాద్‌లో నా ఓటమి ఓ కుట్రనా? కాదా? నిజామాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి. 20 ఏళ్లుగా కేసీఆర్, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పనిచేశానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనంబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె ఏమన్నారంటే.. ఇంటి గుట్టు బయట పెట్టి కుట్ర చేసి నన్ను బయటకి పంపించారు. ఇప్పుడు నా దారి నేను వెతుక్కుంటున్నా. ఈ జిల్లా బిడ్డగా, కోడలిగా మీ

## కర్నూలు బస్సు దుర్ఘటనలో వీడిన మిస్టరీ

- ప్రమాదానికి ముందే బైకర్ పడిపోయినట్లు గుర్తింపు
- బైకును తీసేలోపే లాక్కెళ్లిన బస్సు..అంతలోనే ప్రమాదం
- వివరాలు వెల్లడించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు,అక్టోబరు25 (అక్షరగళం):** తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం నింపిన కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటన మిస్టరీ వీడింది. బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మంటలు చెలరేగి 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో



ద్విచక్రవాహనం నడిపిన శివశంకర్ అనే యువకుడు కూడా మృతి చెందాడు. అయితే, బైక్‌పై శివశంకర్ వెనుక కూర్చున్న వ్యక్తిని ఎర్రిస్వామిగా పోలీసులు గుర్తించారు. అతన్ని పలు కోణాల్లో ప్రశ్నించి కీలక ఆధారాలు సేకరించారు. మిగతా.. 2లో



# రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం అవ్వండి

- పెట్టుబడులతో రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోండి
- 'ఇండియన్' సీఈవోలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు
- ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ప్రత్యేక భేటీ

**హైదరాబాద్,అక్టోబరు25(అక్షరగళం):** 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆస్ట్రేలియాలోని పలు కంపెనీల 'ఇండియన్' సీఈవోలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టి రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోవాలని కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా శనివారం సిడ్నీలో 'ది సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా – ఇండియా రిలేషన్స్' ఆధ్వర్యంలో నిర్వహిం చిన బిజినెస్ కాంక్లేవ్ లో వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో "తెలంగాణ" ముందు వరుసలో ఉందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొ న్నారు. తక్కువ సమయంలో పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన పాలన, సమర్థవంత మైన నాయకత్వం కారణంగా రాష్ట్రంఅంతర్జాతీయ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన గమ్యస్థానంగా మారిందన్నారు.

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూలించే అంశాలు, పెట్టుబడి అవకాశాలు, ప్రపంచస్థాయి మిగతా.. 2లో

## సాయుధ పోరాటం విరమణ పార్టీ నిర్ణయం

- పార్టీకి నష్టం జరగొద్దనే చర్చించాకే లొంగుబాటు
- లొంగిన మావోయిస్ట్ ఆశన్న వీడియో విడుదల



**హైదరాబాద్,అక్టోబర్25(అక్షరగళం):** కేంద్ర బలగాల నిర్బంధం మధ్య మావోయిస్టు పార్టీకి నష్టం జరగొద్దనే ఉద్దేశంతోనే సాయుధ పోరాటాన్ని విరమించా లని కేంద్ర కమిటీలో సమష్టి నిర్ణయం తీసుకున్నామని మాజీ మావోయిస్టు నేత ఆశన్న తెలిపారు. కేంద్ర బలగాల దాడుల నేపథ్యంలో సాయుధ పోరాట విరమణ జరపాలని మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బీఆర్ దాదా నాయకత్వంలోనే కింది స్థాయి నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతనే నిర్ణయం మిగతా.. 2లో





## ఇంటర్ విద్యావిధానంలో మార్పులు

- వచ్చే ఏడాది నుంచే అమల్లోకి కొత్త సిలబస్
- ఫిబ్రవరి 18 నుంచి ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్,అక్టోబర్25(అక్షరగళం):** తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. 2026 ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఆయన మీడియాకు తెలిపారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయని, ఇంగ్లీష్‌లో ఉన్నట్లుగానే మిగతా భాషల్లోనూ ప్రాక్టీకల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. 12 ఏళ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌లో మార్పులు మిగతా.. 2లో

## వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- మద్యం షాపుల డ్రాకు తొలగిన అడ్డంకులు
- 27న యథావిధిగా కలెక్టర్ల సమక్షంలో డ్రాలు
- ఏర్పాట్లు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు



**హైదరాబాద్, అక్టోబర్ 25 (అక్షరగళం):** తెలంగాణలో మద్యం షాపుల డ్రాకు అడ్డంకులు తొలగిపోయాయి. వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 27న యథావిధిగా మద్యం షాపుల డ్రా ప్రక్రియను ఎక్సైజ్ శాఖ నిర్వహించనుంది. కాగా, వైన్ షాపుల కేటాయింపు కోసం గడువు ముగిసిన తర్వాత కూడా దరఖాస్తులు తీసుకున్నారని పేర్కొంటూ ఐదుగురు మద్యం వ్యాపారులు మిగతా.. 2లో




## చిరు అనుమతి లేకుండా ఫోటోలు పేర్లు వాడరాదు

- హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ
- పోస్టులు, వీడియోలు క్రియేట్ చేసిన 30మందికి నోటీసులు

**హైదరాబాద్,అక్టోబరు25 (అక్షరగళం):** అగ్ర కథానాయకుడు చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్‌లను వాడకూడదని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక మాధ్యమాల వేదికగా తమ పేరు, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారంటూ పలువురు అగ్ర నటులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఎఐ మార్ఫింగ్, వాయిస్ సింథసైజ్ ద్వారా ప్రతిష్ట దెబ్బతింటోందని నటీనటుల ఆవేదన మిగతా.. 2లో

## చాదర్‌ఘాట్ కాల్పుల్లో గాయపడ్డ ఇద్దరు దొంగలు



- ఘటనా స్థలిని పరిశీలించిన సిపి సజ్జన్నార్

**హైదరాబాద్,అక్టోబరు25 (అక్షరగళం):** హైదరాబాద్ చాదర్‌ఘాట్ కాల్పుల ఘటనలో ఇద్దరు దొంగలు గాయపడ్డారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఘటనా స్థలిని పరిశీలిం చిన అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. గాయపడి, పోలీసులకు చిక్కిన దొంగ ఒమర్‌పై 25 కేసులతో పాటు రౌడీషీట్ ఉందని సీపీ తెలిపారు. దొంగలను పట్టుకునే క్రమంలో డీసీపీ చైతన్య రెండు రౌండ్లు కాల్పులు జరిపారని చెప్పారు. సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను డీసీపీ చైతన్య, ఆయన గన్‌మ్యాన్ గమనించి పట్టుకునేందుకు ప్రయత్నిం చారు. దొంగలు.. గన్‌మ్యాన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారు. మిగతా.. 2లో

# ఏదో ఒకరోజు అమెరికా అధ్యక్షపీఠం అధిరోహిస్తా

## కమలా హ్యారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూయార్క్:** అమెరికా అధ్యక్ష పదవి కోసం తాను మరోసారి పోటీచేసే అవకాశం లేకపోలేదని మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తెలి పారు. తాను ఏదో ఒకరోజు దేశాధ్యక్షురాలిని అవ్వొచ్చని, భవిష్యత్తులో వైట్‌హౌస్‌లో ఓ మహిళ ఉంటుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచార సమయంలో ఆయన గురించి చేసిన హెచ్చరికలు నిజమైనవేనని నిరూపితమయ్యాయన్నారు. నా మనవరాళ్లు వారి జీవితకాలంలో అమెరికాలో కచ్చితంగా ఓ మహిళా అధ్యక్షురాలిని చూస్తారు. బహుశా అది నేనే కావచ్చు. అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ విషయమై ఇంకా నిర్ణయమేదీ తీసుకోలేదు. కానీ.. రాజకీయాల్లో భవిష్యత్తు ఉందని ఇప్పటికీ భావిస్తున్నాను. నేను చేయాల్సిన పని ఇంకా పూర్తి కాలేదు. నా కెరీర్ మొత్తాన్ని సేవలో గడిపాను. అది నా రక్తంలోనే ఉందని కమలా హారిస్ పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వస్తే ఫాసిస్ట్‌లా ప్రవర్తి స్తారని, నిరంకుశ ప్రభుత్వాన్ని నడుపుతారన్న తన అంచనాలు నిజమయ్యాయని చెప్పారు. న్యాయశాఖను ఆయుధంగా మలచుకుంటానని చెప్పారని, ఇప్పుడు సరిగ్గా అదే చేస్తున్నారని ఆరోపించారు. తదుపరి అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి సంబంధించి డెమొక్రట్ల తరఫున ఆశావహుల రేసులో వెనుకంజలో ఉన్నారనే పోల్స్



అంచనాలపై హారిస్ స్పందించారు. తాను వాటిని పట్టించుకోనని తెలిపారు. ఒకవేళ పోల్స్‌ను పట్టించుకొని ఉంటే.. తాను గతంలో ఎన్నికల్లో పోటీపడేదాన్నే కాదన్నారు. ఇదిలా ఉండగా.. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌పై డెమొక్రట్ల తరఫున కమలా హారిస్ పోటీ చేసి ఓడిపోయిన విషయం తెలిసిందే.

# వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శనివారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నెల 18వ తేదీ వరకు ఉన్న మద్యం టెండర్ల గడువును 23వ తేదీ వరకు పెంచారని పిటిషనర్ తరఫు న్యాయవాదాలు హైకోర్టుకు తెలిపారు. 23వ తేదీకి పెంచడం వల్ల ఐదువేలకు పైగా దరఖాస్తులు అదనంగా వచ్చాయని వివరించారు. ఇది తెలంగాణ ప్రోహిబిషన్ ఎక్సైజ్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్టికల్ 12 (5) ప్రకారం గడువు పెంచడానికి అవకాశం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. ఈ నెల 23న జరగాల్సిన లక్కీ డ్రాను కూడా 27వ తేదీకి పొడిగించారని తెలిపారు. ప్రభుత్వం తరుఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. గడువు పెంచడం అనేది తెలంగాణ ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయమని తెలిపారు. గడువు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ప్రభుత్వ వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు మద్యం దుకాణాల డ్రా ప్రక్రియ నిర్వహించేందుకు ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. హైకోర్టు నుంచి మద్యం షాపుల డ్రాకు అనుమతి రావడంతో డ్రా ప్రక్రియ ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు 27న మద్యం షాపుల డ్రాకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా సోమవారం ఉదయం 11 గంటలకు మద్యం షాపుల డ్రా ప్రకియ నిర్వహించ నున్నారు. కాగా, తెలంగాణలోని 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు వచ్చాయి. మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. డ్రా ఏర్పాట్లను పూర్తి చేయాల్సిందిగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం షాపుల కోసం భారీ స్థాయిలో 95,137 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాల వారీగా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారులు, ప్రజల సమక్షంలో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా మద్యం షాపుల డ్రా ప్రక్రియ కొనసాగనుంది. ఈ డ్రా ద్వారా కొత్త లైసెన్స్‌దారుల ఎంపిక జరగనుంది. అదిలాబాద్‌లో 40 మద్యం షాపులకు 771 దరఖాస్తులు, కోమురం భీం అసిఫాబాద్‌లో 32 షాపులకు 680, మంచిర్యాలలో 73 షాపులకు 1712, నిర్మల్‌లో 47 షాపులకు 3002, జగిత్యాలలో 71 షాపులకు 1966, కరీంనగర్‌లో 94 షాపులకు 2730, పెద్దపల్లి 77 షాపులకు 1507, రాజన్న సిరిసిల్లలో 48 షాపులకు 1381, ఖమ్మంలో 122 షాపులకు 4430, కొత్తగూడెం 88 షాపులకు 3922, జోగులాంబ గద్వాలలో 36 షాపులకు 774, మహబూబ్‌నగర్‌లో 90 షాపులకు 2487, నాగర్‌కర్నూల్‌లో 67 షాపులకు 1518, వనపర్తిలో 37 షాపులకు 757, మెదక్‌లో 49 షాపులకు 1920, సంగారెడ్డి 101 షాపులకు 4432, సిద్దిపేటలో 93 షాపులకు 2782, నల్లగొండ 155 షాపులకు 4906, సూర్యపేట్‌లో 99 షాపులకు 2771, యాదాద్రి భువనగిరిలో 82 షాపులకు 2776, కామారెడ్డి 49 షాపులకు 1502, నిజామాబాద్ 102 షాపులకు 2786, మల్కాజిగిరిలో 88 షాపులకు 5168, మేడ్చల్‌లో 114 షాపులకు 6063, సరూర్‌నగర్‌లో 134 షాపులకు 7845, శంషాబాద్‌లో 100 షాపులకు 8536 వికారాబాద్ 59 షాపులకు 1808, జనగామాలో 47 షాపులకు 1697, భూపాలపల్లి 60 షాపులకు 1863, మహాబూబబాద్‌లో 59 షాపులకు 1800, వరంగల్ రూరల్‌లో 63షాపులకు 1958, వరంగల్ అర్బన్‌లో 65 షాపులకు 3175 దరఖాస్తులు వచ్చాయి.

# కుట్రజేసి నన్ను గెంటేశారు..!

(మొదటి పేజీ తరువాయి)

ఆశీర్వాదం కోసం వచ్చా. 5 నెలలుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల కారణంగా నిజామాబాద్ రాలేకపోయాను. ఇన్ని రోజుల తర్వాత ఇక్కడికి రావటం సంతోషంగా ఉంది. నేను నిజామాబాద్ కోడలిని. ఇది నా గడ్డ. ఎప్పటికైనా ఈ గడ్డలోనే కలిసిపోతా. దేశ వ్యాప్తంగా ఎక్కడ ఉన్న సరే నా మనసు ఈ గడ్డపైకి కొట్టుకుంటుంది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ ఈ జిల్లాలోని కందకూరులో పుట్టారు. ఇంకో పక్క మనాల అడవుల్లో ఎన్ కౌంటర్లు జరిగిన చరిత్ర ఉంది. ఆర్ఎస్ యూ, నుంచి ఆర్ఎస్ఎస్ వరకు అందరికీ మద్దతు ఇచ్చిన చరిత్ర మన జిల్లాది. బీఆర్ఎస్ పార్టీ నుంచి మొట్టమొదటి సారి నిజామా బాద్ జెడ్పీ ఛైర్మన్ గెలిచారు. అప్పటి నుంచే ఉద్యమం ఊపందుకుంది. అన్ని భావాజాలలకు మద్దతునిస్తూ ముందున్న జిల్లా మనది. మీ బిడ్డను కాబట్టి నన్ను ఇక్కడి నుంచి పార్లమెంట్ కు పంపించారు. మీ మర్యాద, గౌరవం కాపాడే విధంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నాను. బీఆర్ఎస్ పార్టీని కూడా దీవించి అన్ని సీట్లు గెలిపించారు. నేను 27 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఉద్యమంలోకి వచ్చా. గత 20 ఏళ్లుగా తెలంగాణ కోసం, కేసీఆర్ కోసం, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పనిచేశా. మీ కోడలిగా, బిడ్డగా నాకు ఎన్ని కష్టాలు ఎదురైనా సరే సహనంతో ఎదురుచూశా. నేను బీఆర్ఎస్ పార్టీకి వ్యతి రేకంగా ఏమీ చేయలే. కానీ నన్ను కుట్ర చేసిన పంపించారు. నిజామాబాద్‌లో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలని కోరుతున్నా.

నిజామాబాద్‌లో నా ఓటమి కుట్రనా కాదా ఆలోచించాలని అడుగు తున్నా. ఇక్కడ ఏం కుట్ర జరిగిందో చిన్న పిల్లలను అడిగిన సరే చెబుతారు. ఎన్ని అవమానాలు జరిగినా సరే నాన్న, బీఆర్ఎస్ మీద ప్రేమతో భరించా. కానీ ఇంటి గుట్టు బయటపెట్టి నన్ను ఇబ్బంది పెట్టారు. నన్ను పార్టీ నుంచి పంపించారు. ఈ సమయంలో మీ ఆశీర్వాదం కావాలని మీ ముందుకు వచ్చా. తొలి అడుగు మన గడ్డ మీది నుంచే అని వచ్చాను. మన అక్కాచెల్లెలు ప్రతి విషయంలో కష్టపడుతాం. కానీ ఒక్క ప్రభుత్వం కూడా మనకు ఏమీ చేయదు. ఈ ప్రభుత్వం రూ. 2500 పెన్షన్ ఇస్తలేదు. పెన్షన్ కోసం ప్రభుత్వం పై పిడికిలి బిగించి కొట్లాడాలె.

ప్రభుత్వం మహిళలు, నిరుద్యోగులను చిన్నచూపు చూస్తోంది. గత 10 ఏళ్లలో మనం కొంత సాధించుకున్నాం. కానీ అమర వీరుల కుటుం బాలకు దక్కాల్సిన గౌరవం, న్యాయం దక్కలేదు. ఆనాటి ఉద్యమకారులకు, ఈనాటి ఉద్యమకారులకు కూడా అన్యాయం జరిగింది. ప్రతి అమర వీరుల కుటుంబానికి కోటి రూపాయలు వచ్చే వరకు ఉద్యమం చేస్తాం. ప్రతి ఉద్యమకారునికి ఐడెంటిటీ కార్డు రావాలె. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న వారికి వచ్చిన విధంగా పెన్షన్ రావాలి. ఇంకా అనేక అంశాలు, విషయాలు ఉన్నాయి. వాటిపై పోరాటం చేయాల్సి ఉంది. జనం బాటలో మేధావులు, విద్యార్థులు సహా అన్ని వర్గాలతో మాట్లాడుతాను. ప్రతి ఒక్కరినీ భాగస్వామిగా చేస్తాను. ప్రతి ఒక్కరికి ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి కావాలని నేను కోరుతున్నా. ఇంత పెద్ద సంఖ్యలో వచ్చి నాకు ఆశీర్వాదం ఇచ్చిన మీరు...ముందు ముందు కూడా నాకు అండగా ఉండాలి.

# హైదరా'బాద్‌షా' మనమే కావాలి!

మొదటి పేజీ తరువాయి..

నగర నాయకులకు, జీహెచ్ఎంసీ కార్పొ రేటర్లకు హైదరాబాద్ సమస్యలపై అవగాహన ఉందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరం కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి, చేపట్టిన అన్ని



కార్యక్రమాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలని సూచించారు.

"మన ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలోని ప్రతి గల్లీలో రహదారుల నిర్వహణ నుంచి మొదలుకొని ఎస్ఆర్‌డీపీ ద్వారా చేపట్టిన అద్భుతమైన ఫ్లై ఓవర్ల, 20వేల లీటర్ల ఉచిత తాగు నీటి పథకం, ఆటంకాలు లేకుండా నీటి సరఫరా, అద్భుతమైన పారిశుద్ధ్య నిర్వహణ, ప్రతి ఒక్కరికి అందిన అభివృద్ధి సంక్షేమ ఫలాల వరకు అన్నింటిని ప్రజలకు వివరించాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేయాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు దిగజారుతున్న కనీస ప్రజల అవసరాలైన పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురికినీటి కాలువల నిర్వహణ వంటి వాటి సమస్యలను ప్రజలకు వివరించాలని కేటీఆర్ కోరారు.

కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ నగర అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి కేవలం రాజకీయాలకే పాల్ప డుతుందని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ మోసాలను, 22 నెలల పాలనలో జరిగిన 'హైడ్రా విధ్వంసం'ను ఎక్కడికక్కడ వివరించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి మోసం చేసిన తీరును పార్టీ శ్రేణులు వివరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ గెలిస్తే, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికే రెండుసార్లు జీహెచ్ఎంసీ పైన గులాబీ జెండా ఎగిరింది. మూడోసారి కూడా గులాబీ జెండా ఎగరడం ఖాయం" అని ఆయన అన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాత్రమే కాదని, హైదరాబాద్ నగరంలో రానున్న రోజుల్లో పార్టీ మారిన ఖైరతాబాద్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యేల పైన అనర్హత వేటు కచ్చితంగా పడుతుందని, ఆ రెండు నియోజకవర్గాల్లో కూడా ఉప ఎన్నికలు తప్పవని కేటీఆర్ అన్నారు. వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని తెలిపారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక విజయం ఖాయమని, అయితే మెజార్టీ కోసం మనం మరింత కష్టపడాలని కేటీఆర్ నాయకత్వా నికి సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌కు ఓటు వేసేలా ప్రజలకు మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కోరారు.

# రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం అవ్వండి



మొదటి పేజీ తరువాయి..

మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల విధానాలు, ఎకో సిస్టం, సింగిల్ విండో అనుమతుల వ్యవస్థ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థల భాగ స్వామ్యంతో పారిశ్రామిక అవస రాలకు అనుగుణంగా 'ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్'ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకుంటున్న చొరవను వివరించారు.

ఏఐ, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యు ఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఈవీల తయారీ తదితర రంగాల్లో తెలంగాణ లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పెట్టుబ డులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో 'ది సెంటర్ ఫర్ ఆస్ట్రే లియా – ఇండియా రిలేషన్స్' ఛైర్ పర్సన్ స్వాతి దవే, 'ఆస్ట్రేలియా – ఇండియా' బిజినెస్ కౌన్సిల్ నేషనల్ అసోసియేట్ ఛైర్మన్ ఇర్ఫాన్ మాలిక్, ఈటీపీఎల్ డైరెక్టర్ సౌరవ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# 14వేల అంగన్వాడీ టీచర్ హెల్పర్ల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

అంగన్వాడీ కేంద్రాలను పటిష్ట పరుస్తున్నాం. పౌష్టికాహారానికే అంగన్వాడీ కేంద్రాలను పరిమితం చేయకుండా.. ప్రాథమిక విద్యను



సైతం చిన్నారులకు అందజేస్తున్నాం. అమ్మ ఆప్యాయతకు నిలయాలుగా అంగన్వాడీ కేంద్రాలు మారుతున్నాయి. అంగన్వాడీ చిన్నారులకు 57 రకాల ఆట వస్తువులు, యూనిఫామ్‌లు ఇస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. మన దేశ భవిష్యత్తు అంగన్వాడీ కేంద్రాల్లోనే ఉంది. అందుకే ప్రతి ఒక్క సూపర్‌వైజర్ తన వృత్తి ధర్మాన్ని నిక్కచ్చిగా పాటించాలి' అని సూచించారు మంత్రి సీతక్క. 'ఒక్కో సూపర్‌వైజర్ కింద 25 అంగన్వాడీ కేంద్రాలు ఉంటాయి. అంగన్వాడీ కేంద్రాల్లో ఎక్కడా చిన్న లోపం లేకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత మీదే. నియామక పత్రాలు అందుకొని ఈరోజు నుంచి మీరు మహిళా శిశు సంక్షేమ శాఖలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. మీ ఉద్యోగ బాధ్యతల్లో ఇది ప్రాథమిక దశ... ఎలాంటి తప్పటడుగులు వేయొద్దు. పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. తెలంగాణలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలి. మెరుగైన, బలమైన తెలంగాణ నిర్మాణంలో మీరంతా భాగస్వాములు కావాలి. అంగన్వాడీ చిన్నారులపై కేవలం సానుభూతి ఉంటే సరిపోదు. అంగన్వాడీ సిబ్బందికి ఎన్నో రకాల ప్రయోజనాలు కల్పిస్తున్నాం' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## కర్నూలు బస్సు దుర్ఘటనలో

# వీడిన మిస్టరీ

(మొదటి పేజీ తరువాయి)

కేసు వివరాలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మీడియాకు వెల్లడించారు. శుక్రవారం జరిగిన బస్సు ప్రమాద ఘటన దర్యాప్తులో భాగంగా బైక్ నడుపుతూ చనిపోయిన శివశంకర్‌తో పాటు వెనుకాల కూర్చున్న వ్యక్తి ఎర్రిస్వామి అలియాస్ నానిగా గుర్తించాం. అతన్ని పలు కోణాల్లో విచారించాం. ఎర్రిస్వామి, పల్సర్ బైక్ నడుపుతున్న శివశంకర్ ఇద్దరూ కలిసి లక్ష్మీపురం గ్రామం నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2గంటలకు తుగ్గలికి బయల్దేరారు. మార్గ మధ్యలో అర్ధరాత్రి 2.24 గంటలకు కియాషోరూమ్ సమీపంలోని ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రూ.300 పెట్రోల్ పోయించుకున్నారు. అక్కడి నుంచి బయల్దేరిన కొద్ది సేపటికే చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడ్ అయి.. రోడ్డుకు కుడివైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక ఉన్న ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు మధ్యలో పడి ఉన్న శివశంకర్‌ను పక్కకు తీసి, బైక్‌ను తీద్దామనుకునే సరికి అంతలోనే వేగంగా వచ్చిన బస్సు బైక్‌ను ఢీకొని కొద్ది దూరం ఈడ్చు కెళ్లింది. బస్సు కింద మంటలు రావడంతో ఎర్రిస్వామి భయపడి అక్కడి నుంచి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లి పోయాడు. బస్సు ప్రమాద ఘటనపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనగిస్తున్నాం అని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

## చిరు అనుమతి లేకుండా

# ఫోటోలు పేర్లు వాడరాదు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో చిరంజీవి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, చిరంజీవికి అనుకూలంగా తీర్పునిచ్చింది. టీఆర్పీ, లాభాల కోసం చిరంజీవి పేరును దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో చిరంజీవి పేరును వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించవద్దని హెచ్చరించింది. మార్ఫింగ్ చేసిన డిజిటల్ వేదికలపై ఆంక్షలు విధించింది. ఇప్పటికే ఇలాంటి పోస్టులు, వీడియోలను క్రియేట్ చేసిన 30 మందికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 27కి వాయిదా వేసింది. తాజాగా హైద రాబాద్ సీపీ సజ్జనార్ కలిసినప్పుడు ఇదే విషయమై చిరంజీవి ఫిర్యాదు చేశారు. దీనిని సమర్థంగా అమలులోకి తీసుకురావడానికి న్యాయ నిపుణుల సలహాలు కోరారు. ఇటువంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు చట్టాలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరంపై ఇరువురు చర్చిం చారు. న్యాయస్థానంలో తనకు అనుకూలంగా తీర్పు రావడంలో కృషి చేసిన అడ్వకేట్ ఎస్.నాగేశ్ రెడ్డి, ఆయన బృందానికి చిరు ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.

## సాయుధ పోరాటం

# విరమణ పార్టీ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. తాము ఏకపక్షంగా లొంగిపోయి తుపాకులు అప్పజెప్పామని వస్తున్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆశన్న అన్నారు. దేశవ్యాప్తంగా సాయుధ పోరాటాన్ని విరమించాలని నిర్ణయించినప్పటికీ... సమాచార లోపం కారణంగానే కొంతమంది సీసీ, జడ్సీ సభ్యులు ఈ నిర్ణయాన్ని తప్పుగా భావిస్తున్నారని తెలిపారు. ఇటీవల ఆశన్న, మరో 200 మందికి పైగా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఎదుట మల్లోజుల వేణుగోపాల్ లొంగిపా యారు. ఇద్దరినీ తప్పుపడుతూ విప్లవ ద్రోహులుగా పేర్కొంటూ అభయ్ పేరుతో ఇటీవల ఓ లేఖ విడుదలైంది. ఈ లేఖలోని పలు అంశాలను ఖండిస్తూ ఆశన్న వీడియో విడుదల చేశారు.

# చాదర్‌ఘాట్ కాల్పుల్లో గాయపడ్డ ఇద్దరు దొంగలు

(మొదటి పేజీ తరువాయి)

ఈక్రమంలో గన్ మ్యాన్, డీసీపీ చైతన్య కింద పడిపోయారు. వెంటనే తేరుకున్న డీసీపీ, గన్‌మెన్ దొంగలపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఇద్దరు నిందితులు గాయపడ్డారు. నిందితుడు ఒమర్‌పై రెండు సార్లు పీడీ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2016లో కామటిపురం పీఎస్‌లో నమోదైన పీడీ యాక్టు కేసులో ఏడాది జైల్లో ఉన్నాడు. 2020లో హుస్సేనీ ఆలమ్ పీఎస్‌లో పీడీ యాక్ట్ కేసులో ఏడాదిపాటు చంచల్‌గూడ జైల్లో ఉండి బయటకు వచ్చిన తర్వాత కూడా ఒమర్ ప్రవర్తన మారలేదు. ఆ తర్వాత కాలాపత్తర్ పీఎస్‌లో రెండు కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు.

## చొరబాటుదారులను

# ఉపేక్షించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతుందా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు.

చొరబాటుదారులను కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్ని యాత్రలైనా నిర్వహించ నివ్వండి. ఏం చేసినా.. వారిని ఆయన రక్షించలేరు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం. ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం. వారి స్వదేశానికి పంపిస్తాం అని అమిత్ షా స్పష్టం చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కేవలం తన కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్జేడీ పాలనలో హత్యలు, దోపిడీలు తదితర అనేక నేరాలు యథేచ్ఛగా జరిగాయని, కానీ.. ఎన్డీయే హయాంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. జంగల్‌రాజ్ తిరిగి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ఇదిలావుంటే కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, బిహార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తామన్నారు. 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖగడి యాలోని గోగ్రీలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. బిహార్‌ను నంబర్ వన్‌గా మార్చేందుకు.. పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు.

# ఇంటర్ విద్యావిధానంలో మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

జరగబోతున్నట్లు తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సిలబస్ మారబోతున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యా విధానంలో మార్పులతో పాటు పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా ల్యాబ్స్ , ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉంటాయి.. అలాగే, ఇంటర్ సిలబస్ లోనూ మార్పులు చేసినట్లు ప్రకటించారు. 12 సంవత్సరాల తర్వాత మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బొటనీ, జువాలాజీలో సిలబస్ లో మార్పులు జరిగాయని ప్రకటించారు. హ్యూమానిటీస్ సబ్జెక్టుల్లో యాక్టివిటీ బేస్డ్ సిలబస్ ఏప్రిల్ మొదటి వారంలో బుక్స్ అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారు. అలాగే, కొత్త కోర్స్ కోర్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య చెప్పుకొచ్చారు. ఇంగ్లీష్ లో ఉన్నట్టు గానే మిగతా లాంగ్వేజెస్ లోనూ ప్రాక్టికల్స్ ఉంటాయి.ఇకపై 80 మార్కులు ఎక్స్‌టర్నల్, 20 మార్కులు ఇంటర్నల్ మార్కులుగా ఉంటాయన్నారు. ల్యాబ్ ప్రాక్టికల్స్ ప్రతి సంవత్సరం 15 మార్కుల చొప్పున నిర్వహించనున్నారు. అంతేకాకుండా, ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు.

# ఆక్రమిత కాశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘన

## పాక్ తీరును ఐరాసలో ఎండగట్టిన భారత్

**న్యూఢిల్లీ,అక్టోబర్25(అక్షరగళం):** ప్రజాస్వామ్యం అనే పదం పాకిస్థాన్ కు ఎప్పటికీ వింతేనని భారత్ దుయ్యబట్టింది. అక్కడ ఏనాడు ఇది కనిపించదన్నారు. అలాగే ఆ దేశం చట్టవిరుద్ధంగా ఆక్రమించిన ప్రాంతాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై భారత్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆ దేశ సైన్యం ఆక్రమణ, అణచివేత, వనరులను చట్టవిరుద్ధంగా వినియోగించడం వంటి వాటిపై అక్కడి ప్రజలు తిరుగుబాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలను అంతం చేయాలని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగంగా ఉందని, ఎప్పటికీ ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. ఆ ప్రాంత ప్రజలు భారత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వారి ప్రాథమిక హక్కులను వినియోగించు కుంటున్నారని తెలిపారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com



# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఆచారి



**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** కడ్తాల్ మండల పరిధిలోని వంపుగూడ గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు గండికోట శేఖర్ మాతృమూర్తి శారదమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మృతురాలు శారదమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గండికోట శేఖర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అండగా ఉంటా అధైర్య పడొద్దని భరోసానిచ్చారు.




## 27న మద్యం దుకాణాల కేటాయింపుకు డ్రా..

**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 17 మద్యం దుకాణాలకు 642 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహాన్ తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఆమనగల్లు మండలంలోని 6 దుకాణాలకు 173, కడ్తాల్ మండలంలోని 5 దుకాణాలకు 239 దరఖాస్తులు, తలకొండపల్లి మండలంలోని 3 దుకాణాలకు 148 దరఖాస్తులు, మాడ్గుల మండలంలోని 3 దుకాణాలకు 82 దరఖాస్తులు వచ్చినట్లు, ముత్తమ్మ 17 దుకాణాలకు కడ్తాల్ మండలంలోని ఒక దుకాణానికి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దుకాణాలకు ఈనెల 27న ఉదయం 9 గంటలకు శంషాబాద్ లోని మల్లికా కన్వెన్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తుదారులు డ్రా తీసే సమయానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

## రహదారిపై ఆక్రమణల తొలగింపు

**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపల్ కేంద్రంలోని ఆమనగల్లు – మాడుగుల రోడ్డు ఇటీవల విస్తరించారు. 60 ఫీట్ల రోడ్డును చిరు వ్యాపారులు ఆక్రమించుకోవడంతో రోడ్డు కుదించుకపోయింది. దీంతో రోడ్డును ఆక్రమించిన



దుకాణాలను శనివారము మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అధికారులతో కలిసి తొలగించారు. రోడ్డు వెడల్పు పెరగడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సులభంగా రాకపోకలు సాధ్యమవుతాయన్నారు. హైదరాబాదు శ్రీశైలం జాతీయ రహదారి ఆనుకొని ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల దుకాణాలను పోలీస్ సహకారంతో తొలగిస్తామని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. లేనిచో మున్సిపల్ చట్టం 2019 ప్రకారము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

**- విజయ్ రాథోడ్**

**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కెఎన్ఆర్ యువసేన జిల్లా నాయకులు విజయ్ రాథోడ్ పేర్కొన్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో ఇందిరమ్మ ఇల్లును శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే




స్లాబ్ పూర్తి చేసుకొని పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదన్నారు. గతంలో ఎంతోమందికి ఇళ్లను ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు కూడా ఇళ్లను ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు హరిలాల్, పత్య నాయక్, సురేష్ నాయక్, రమేష్ నాయక్, సునీత, మురళీ, పాండు తదితరులున్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కుప్పగండ్ల మాజీ సర్పంచ్ మొక్తాల శేఖర్ ఆర్థిక సహాయం అందజేత

**వెల్దండ అక్టోబర్ 25 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని గోల్లోని పల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దున్న జంగమ్మ జంగయ్య దంపతుల కూతురు





వివాహానికి కుప్పగండ్ల మాజీ సర్పంచ్ మొక్తాల శేఖర్ 4000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో నాగయ్య గౌడ్ కృష్ణయ్య గోరేటి దశరథం దేరంగుల రమేష్ జగన్ సత్తయ్య శంకరయ్య శ్రీకాంత్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే నవీన్ యాదవ్ గెలిసేందుకు దోహదపడతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి యూసుఫ్ గూడా ప్రచారంలో ఆయన తెలిపారు. శనివారం నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యేతో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేసి గెలిపిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాన్ని ఓటర్లు నమ్మే స్థితిలో లేరని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన స్పష్టం చేశారు. స్థానికుడు, ప్రజల కష్ట సుఖాల్లో అందరికీ ఎప్పుడూ అండగా ఉండే నవీన్ యాదవ్ ను గెలిపించుకుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వైస్



ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రవికాంత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు దళపతి, యూత్ కాంగ్రెస్ ఆమనగల్లు మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, పెరుమాళ్ళ వెంకట్ రెడ్డి, విజయ్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, రాజేందర్ నాయక్, బాబా, పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేయాలి

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**జోగులాంబ గద్వాల జిల్లా, అక్టోబర్ 25, (అక్షర గళం):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు- ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఇందులో కేటగిరీ ఎ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సీ లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు




జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డి లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. అన్ని కేటగిరీలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఎ జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, తద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయబడుతుందని తెలిపారు. అనంతరం కేటగిరి సీ, క్యాటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఎ కు మ్యాపింగ్ చేయాలని, ఈ ప్రక్రియను ఎ ఈ ఆర్ఆ ఓ ల ఆధ్వర్యంలో బి ఎల్ ఓ సూపర్ వైజర్లు, బి ఎల్ ఓ లు బి ఎల్ ఓ యాప్ ద్వారా వచ్చే శనివారం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ, బి ఎల్ ఓ లు, ఎల్ ఓ సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మొదట కేటగిరి ఎ ఓటరు జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించిన తర్వాత కేటగిరి సీ,డీ లను కేటగిరి ఎ కు లింక్ చేయడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అలివేలు, తహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం అధికారి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఛలో హైదరాబాదులో విజయవంతం చేయండి

**వెల్దండ అక్టోబర్ 25 (అక్షర గళం):** సుప్రీం కోర్టు ప్రధానమూర్తి బి ఆర్ గవాయిపై సెంట్రల్ హాల్లో రాకేష్ కిషోర్ లాయర్ దాడిని నిరసిస్తూ ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే తలపెట్టిన ఛలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షులు గుడిగానిపల్లి రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎమ్మార్పిఎస్ మండల ఇన్చార్జి మంగళగిరి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జరిగిన దాడి భారత రాజ్యాంగం మీద, దళితుల ఆత్మ గౌరవం పై దేశానికి స్వాతంత్రం వచ్చి 80 యేండ్లు గడుస్తున్నా దళితుల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం



చేశారు. గవాయి మీద దాడిని ఇప్పటి వరకు దాడి చేసిన వ్యక్తిపై మీద ఎలాంటి చర్యలు తీసుకోకుండ ఢిల్లీ పోలీస్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసిస్తూ గవాయి మీద దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మ గౌరవ మహా ర్యాలీ ప్రదర్శన లో వివిధ సంఘాల, రాజకీయ, ప్రజా సంఘాల దళితులు పాల్గొనాలనీ విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బల్లె జగన్ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి,బహుజన వాది కానుగుల జంగయ్య,మాలమహానాడు రాష్ట్ర నాయకుడు నిరంజన్,మంగళగిరి సత్యం,గ్రామ కమిటీ నాయకులు రమేష్ మాదిగ, పెద్దయ్య మాదిగ, అంజయ్య, కొమ్ము లింగం నవీన్ మాదిగలు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును ఎవరూ ఆపలేరు..

**జూబ్లీహిల్స్ అభ్యర్థిపై అసత్యాలను అంటకట్టి గెలువాలని చూడటం వారి భ్రమే**

**కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 25, (అక్షర గళం) :** జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై అసత్యాలను అంటకట్టి గెలువాలని చూడటం వారి భ్రమ మాత్రమేనని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తో కలిసి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి. నవీన్ యాదవ్‌ని భారీ మెజారిటీతో గెలుపించేందుకు శనివారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తెలంగాణ రాష్ట్ర కార్మిక , గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రచారంలో పాల్గోన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి జరుగుతున్న ప్రజా పాలన విధానాన్ని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అనునిత్యం తప్పుడు ఆరోపణలు



చేస్తున్నాయి అని మండిపడ్డారు.. చిన్న శ్రీశైలం యాదవ్‌తో సహాయం కోరిన వారే అసత్యాన్ని ప్రచురించడం చాలా బాధాకరం అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ గెలుపై నియోజకవర్గం ప్రజలు గట్టి నమ్మకంతో ఉన్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చేసిన సేవలే గుర్తుండిపోతాయి

**- కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా**

**- ఉద్యోగ విరమణ పొందిన రవి కుమార్‌కు ఘన సన్మానం**

**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** విధి నిర్వహణలో మనం ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీహెచ్ఈఓగా విధులు నిర్వహిస్తున్న రవి కుమార్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాబా హాజరై మాట్లాడారు. అంకిత భావం సేవలకు చిరస్థాయి గుర్తింపు ఉంటుంద న్నారు. ఎంపీహెచ్ఈఓగా అత్యంత సమర్థమైన అధికారిగా పనిచేశారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం లభించే విశ్రాంత సమయం



తమ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని ఆయన కోరారు. అనంతరం రవి కుమార్ మాట్లాడుతూ.. తనకు అన్ని విధాల సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ మైమునతో కలిసి రవికుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.



## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

**- ఎమ్మెల్యే కసిరెడ్డ నారాయణరెడ్డి**

**వెల్దండ, అక్టోబర్ 25 (అక్షర గళం):** హైదరాబాదులోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే నవీన్ యాదవ్ గెలిసేందుకు దోహదపడతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి యూసుఫ్ గూడా ప్రచారంలో ఆయన తెలిపారు. శనివారం నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యేతో వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ ఎండి రషీద్ పురుషోత్తం చారి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 25, (అక్షర గళం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి నాగులూర్ లో బీఆర్ఎస్ యూత్ నాయకులు మామిడిపల్లి భాను చందర్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో




కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, ఆనంద్ కుమార్, ప్యాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు బాలకృష్ణ, యువ నాయకులు విష్ణు యాదవ్, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పార్కు కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు

**పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసిన హైడ్రా**

**మేడ్చల్ , అక్టోబర్ 25, (అక్షర గళం):** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్




మండలం మచ్చబొల్లారంలోని ఓ పార్కును హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 164లో శ్రీ సాయి సూర్య ఫేజ్-2లో పార్కుకోసం దాదాపు 520 గజాల స్థలాన్ని అప్పట్లో కేటాయించారు. 1972లో వేసిన ఈ లే ఔట్‌లో పార్కు కోసం కేటాయించిన ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, పార్కు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని శ్రీ సాయి సూర్య కాలనీ నివాసితులు హైడ్రాకు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా విచారణ పూర్తి చేసింది. శనివారం ఉదయం పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దీంతో శ్రీ సాయి సూర్య కాలనీ నివాసితులు సంబరాలు చేసుకున్నారు. హైడ్రాను తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. దశాబ్దాలుగా పార్కు అభివృద్ధిని అడ్డుకున్న వారి చెర నుంచి పార్కును విడిపించిన హైడ్రా అధికారులను అభినందించారు.



# కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం

**బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావులు**

**హైదరాబాద్, అక్టోబర్ 25, (అక్షర గళం):** ఇరురాష్ట్రాల మధ్య సమన్వయంతో కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పార్టీని బలోపేతం చేసేలా, మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నామని బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు లు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల వ్యూహం, కార్యకలాపాల సమన్వయం, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంపొందించేలా చేపట్టే కార్యక్రమాలపై ఇద్దరు అధ్యక్షులు చర్చించారు. అనంతరం బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ పీవీఎన్ మాధవ్ తో పాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బిజెపి ఆంధ్రప్రదేశ్ చీఫ్ స్పోక్ పర్సన్ జయప్రకాష్ కూడా రాష్ట్ర కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరిగింది. అనంతరం బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి తెలంగాణ రాష్ట్ర కార్యాలయానికి రావడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యాలయం నిర్మాణం, గృహప్రవేశం వంటి పనుల్లో పాల్గొన్న అనుభవం నాకుందన్నారు. పూర్వంలో భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, పార్టీ జాతీయ కార్యదర్శి గా పనిచేశానని తెలిపారు. ఆ సమయంలో ఈ కార్యాలయం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటనలు , ఇతర కార్యకలాపాలు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయానికి రావడం హోమ్ కమింగ్ అనుభవం ఇస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బిజెపి అధ్యక్షుడిగా రాంచందర్ రావు నియామకం కావడం మేం అదృష్టంగా, ఆనందంగా భావిస్తూ.. వారికి శుభకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలు తెలుగు ప్రజలకు రెండు కళ్లలాంటివి. రెండు ప్రాంతాల అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఆయన పూర్వంలో బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పాల్గొని, శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అనేక పరిచయాలు ఏర్పరచుకున్నారు. మేం ఈ ప్రాంతంలో కూడా




పార్టీ నిర్మాణంలో, కార్యక్రమాల్లో పనిచేశాం. మా నాన్న, పీవీ చలపతి రావు, ఉమ్మడి రాష్ట్రానికి బిజెపి అధ్యక్షుడిగా పనిచేశారు. వారికి ఈ ప్రాంతంతో మంచి అనుబంధం ఉందన్నారు. తెలంగాణకు విచ్చేసిన సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసి అనేక అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన అనేక పనులు, పార్టీకి సంబంధించిన సంస్థాగత అంశాల్లో సమన్వయంతో కలిసి పని చేస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి విజయం సాధించడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. తెలుగు ప్రజల సంక్షేమం, వారి ఆలోచనలను ముందుకు తీసుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ నడుస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఏపీ అభివృద్ధిపథంలో దూసుకెళ్తోందన్నారు. ఉత్తరాంధ్ర, విశాఖపట్నం కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా అమరావతి, రాయలసీమ - ఈ మూడు ప్రాంతాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. ఒక సంవత్సరంలోనే ఆంధ్ర ప్రదేశ్‌కు ఊహించని విధంగా రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు రావడం, అనేక ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగడం జరిగిందన్నారు. ఏపీ భవిష్యత్తును మలుపుతిప్పేలా సుమారు 15 బిలియన్ డాలర్స్ ఇన్వెస్ట్‌మెంట్ తో విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుకు ముందుకొచ్చిందన్నారు. దేశంలోనే అతిపెద్ద ఎఫ్డిఐ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది, దీన్నిబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు కేంద్రంగా మారుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా చర్చించుకునేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గూగుల్ ఇన్వెస్ట్మెంట్స్ రావడంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ప్రధానమైందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ అవకాశాలన్నింటిని అందిపుచ్చుకొని ముందుకువెళ్తోందన్నారు. దేశంలోనే అతిపెద్ద రెన్యువల్ ఎనర్జీ %-% గ్రీన్ హైడ్రోజన్ హబ్ రూ. 1.80 లక్షల కోట్లతో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ప్రారంభమైందన్నారు. నెల్లూరు దగ్గర బీపీసీఎల్ కు సంబంధించి రూ. 80 వేల కోట్ల పెట్రోకెమికల్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోంది. రాయలసీమను "పవర్ హౌస్ ఆఫ్ సౌత్ ఇండియా"గా తీర్చిదిద్దడంలో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఎకనామిక్ కారిడార్లు ఉన్నాయి. విశాఖపట్నం - చెన్నై, హైదరాబాద్ - బెంగళూరు, బెంగళూరు - చెన్నై... ఇవన్నీ డబుల్ ఇంజిన్ సర్కార్ ఫలితాలన్నారు. తెలంగాణలో కూడా డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి, తద్వారా అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో ఏపీ అభివృద్ధి కోసం కేంద్ర సహకారంతో కృషి చేస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పూర్తిస్థాయిగా పాల్గొంటాం. పురంధేశ్వరి కూడా ప్రచారంలో పాల్గొంటారనన్నారు. రాబోయే కాలంలో వివిధ సమావేశాలు ఏర్పాటు చేసి, జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌లో బిజెపి గెలిచేలా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బిజెపి నాయకులు కృషి చేస్తామన్నారు.

## హై టెన్షన్ వైర్ల కింద ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం

**పట్టించుకోని జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులు**

**మాదాపూర్, అక్టోబర్ 25, (అక్షర గళం):** మాదాపూర్ డివిజన్ పరిధిలోని బిక్షపతి నగర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా హై టెన్షన్ వైర్ల కిందే అక్రమ నిర్మాణాలు చేపడుతున్న జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని బి ఆర్ ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉపాధ్యక్షులు మిద్దెల మల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెల గాటం ఆడుతున్న అక్రమ నిర్మాణదారుడు అధికారులు కనీసం అటువైపు తొంగి చూడడం లేదన్నారు. హై టెన్షన్ వైర్ల కింద బారి ఎత్తున నిర్మాణం చేపడుతున్నారు ఇట్టి నిర్మాణానికి పని కొరకు అమాయక కూలీలు తెలియక వస్తున్నారన్నారు. ఇట్టి హై టెన్షన్ వైర్లకు చాలా ఎలక్ట్రికల్ పవర్ ఉంటుంది దాదాపు 7 8 మీటర్ల దూరం నుండి వాటి ప్రభావం చూపుతుంటాయి అయితే ఇట్టి వైర్ల కిందనే నిర్మాణం చేపడుతున్నారు ఇట్టి నిర్మాణానికి పైన ఉన్న హై టెన్షన్ వైర్లకు దూరం చాలా తక్కువ అసలు హై టెన్షన్ వైర్ల కింద నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. నిబంధనలు ఉన్నప్పటికీ ఇట్టి నిర్మాణదారులు ఏలాంటి అనుమతులు తీసుకోకుండా అధికారులను, ఫిర్యాదు దారులను మభ్యపెట్టి భారీ ఎత్తున నిర్మాణాన్ని చేపడుతున్నాడు కావున అధికారులు పరిశీలించి వెంటనే ఇట్టి అక్రమ నిర్మాణాన్ని తొలగించి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ప్రమాదాన్ని పసిగట్టి ప్రమాదం జరగకుండా చూసిన నాడే మనము నిజమైన ప్రజాసేవ కులము అని గుర్తిస్తారన్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇట్టి అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి ఇట్టి అక్రమ నిర్మాణానికి పాల్పడుతున్న యజమానిని మందలించి నిర్మాణాన్ని నిలిపి వేయాలన్నారు.





## బాబోయ్.. శునకాలు

**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీలో వీధి కుక్కల బీభత్సం మితిమీరింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో వీటి సంచారం ప్రజల దైనందిన జీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. ఆయా కాలనీకి వెళ్లే దారిలో శునకాలు గుంపులుగా తిరుగుతూ అడ్డుపడుతున్నాయి. రాత్రివేళల్లో వీటి అరుపులు, కేకలు నిద్రలేకుండా చేస్తున్నాయని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ద్విచక్ర వాహనదారులకు రాత్రి సమయంలో కుక్కలు ఒక్కోసారి వాహనాల ముందు నిలబడి ప్రమాదాలకూ దారి తీస్తున్నాయి. ఇప్పటికే కొన్ని బైక్‌లపై వస్తున్న వారు గాయాలై చికిత్స పొందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటు, ఆయా కాలనీలలో ఇళ్ల చుట్టు ప్రక్కల కూడా శునకాల సంచారం పెరిగిపోయింది. చిన్న పిల్లలు వీటివల్ల భయంతో బయటకి రావడానికి కూడా భయపడుతున్నారు. అరుపులే కాదు కొన్నిసార్లు పిల్లల దగ్గరికి వచ్చి భయపెడుతున్నాయి. ఎప్పుడెప్పుడు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి ఉందని అంటూ స్థానికులు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పెద్ద ప్రమాదాలు జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పెరుగుతున్న ఈ శునక సమస్యపై ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి పరిష్కారం చూపకపోతే, ఇబ్బందులు తప్పవని పట్టణ వాసులు చెబుతున్నారు.



## పరమేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**ఉప్పల్, అక్టోబర్ 25, (అక్షర గళం):** ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, ఉప్పల్ నియోజకవర్గపు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## దైవభక్తితో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, అక్టోబర్ 25 (అక్షర గళం):** దైవభక్తి ప్రతి ఒక్కరిలో మానసిక ప్రశాంతత కలుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మించిన తుల్జా భవాని ఆలయంలో తుల్జా మాత విగ్రహ ప్రతిష్ఠించిన కార్యక్రమానికి పురస్కరించుకొని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే నారాయణరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేవాలయాలను సందర్శించడానికి కొంత సమయాన్ని కేటాయించాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని గుర్తుచేశారు. ఆలయాలు భారత సంస్కృతీ సంప్రదాయాలకు తార్కాణాలని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, లక్పతి నాయక్ భిక్య నాయక్, పాండు నాయక్, శంకర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, శీను నాయక్, టిక్ లాల్ నాయక్, నరేష్ నాయక్, జాన్యా నాయక్, రూప్ సింగ్ నాయక్, శీను నాయక్, అంజి, రాజు, రవి, రెడ్యా, బిచ్యా, హరియా, జగన్, చందర్ తదితరులు పాల్గొన్నారు.





# బుల్లెట్ ట్రైన్ల యుగంలో ఇవి ఇంకా అవసరమా?

భారతదేశంలో రోజుకు 22 కోట్ల మంది ప్రయాణికులను రవాణా చేస్తున్న సుమారు 4,00,000 స్టేజ్ క్యారేజ్ బస్సుల్లో (57% బస్సు ట్రిప్పులు) అధిక శాతం స్లీపర్ కాన్ఫిగరేషన్‌లోనే ఉన్నాయి. అయితే, ఇటీవల కర్నూలు అగ్ని ప్రమాదంలో 20 మంది సజీవదహనం కావడం, ఈ సౌకర్యవంతమైన ప్రయాణాన్ని "కదిలే శవపేటిక"'గా భయపెడుతూ, డిజైన్ లోపాలని, పర్మిట్ల నుండి డ్రైవర్ పాత్రల వరకు చర్చ జరుగుతోంది.

మన ఆంధ్రా విషయానికి వద్దాం.

వందలాది బస్సులు రోజూ వైజాగ్, రాజమండ్రి, విజయవాడల నుండి.. మధ్యలో దారుల్లో కూడా ఎక్కించుకొని బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై లాంటి నగరాలకు తీసుకు వెళుతున్నాయి.

గత్యంతరం ఏముంది?

కనీసం నేరుగా బస్సు చేరుకొనే సమయానికి ట్రైన్ చేరుకునే మార్గాలు లేవు. చుట్టూ తిరుగుతూ కొంచెం ఆలస్యం అయినా పర్లేదు అనుకున్నా.. రద్దీతో టికెట్లు దొరకవు. వందేభారత్ / తాత్కాల్ టికెట్ల రేట్లు విమాన ప్రయాణం అంత ఖరీదుగా ఉంటుంది. అటూ ఇటూ విమానాశ్రయాలకు అంత ఖర్చుపెట్టుకొని వెళ్లి చేరేలోపు బస్సులో చౌకగా.. సౌకర్యంగా చేరుకోవచ్చు అని గత్యంతరం లేక ఆ బస్సు ప్రయాణాలు ఎంచుకుంటున్నారు.

ప్రపంచంలోని ఆధునిక దేశాలు ఈ ప్రమాదకర విధానాన్ని ఎప్పుడో వదిలిపెట్టాయి. చైనా, వరుస ప్రమాదాల్లో 252 మంది మరణించడంతో, 2012లో కొత్త స్లీపర్ బస్సుల ఉత్పత్తిని పూర్తిగా నిషేధించింది. ఈ నిషేధం, 250–350 km/h వేగంతో నడిచే ప్రపంచంలోనే అతిపెద్ద హై-స్పీడ్ రైలు (HSR) నెట్‌వర్క్ (29,000o కి.మీ.) విస్తరణతో జరిగింది.

జపాన్, యూరప్‌లలో బుల్లెట్ రైళ్లు అంతర్-నగర ప్రయాణానికి ప్రామాణికంగా మారాయి.

రైలు ప్రయాణంతో పోలిస్తే బస్సు ప్రయాణంలో ప్రమాదాల రేటు 3.7 రెట్లు ఎక్కువగా ఉంది. ఈ గణాంకాలు, భారతదేశం కూడా బుల్లెట్, హై-స్పీడ్ రైళ్లు లేదా కనీసం BRT (Bus Rapid Transit) వంటి సురక్షిత ప్రత్యామ్నాయాల వైపు మారాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

భారతదేశం తక్షణమే చర్యలు తీసుకోవాలి. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మరియు వందే భారత్ స్లీపర్ రైళ్లను వేగంగా విస్తరించడం, చౌకగా మార్చడం ద్వారా అంతర్-నగర ప్రయాణానికి సురక్షితమైన ప్రత్యామ్నాయాన్ని అందించాలి. సుదీర్ఘ కాలంలో, చైనా మాదిరిగానే కొత్త స్లీపర్ బస్సుల ఉత్పత్తి, రిజిస్ట్రేషన్‌పై పూర్తి నిషేధం విధించాలి.

దీనికి సమాంతరంగా, ముంబై-అహ్మదాబాద్ వంటి ప్రధాన ఆర్థిక కారిడార్లలో బుల్లెట్ రైలు (HSR) ప్రాజెక్టుల నిర్మాణాన్ని మొదలెట్టినట్లు, దక్షిణ భారతదేశంలో కూడా నగరాల మధ్య మొదలెట్టి, యుద్ధ ప్రాతిపదికిన వేగవంతం చేయాలి. 3 లక్షల కోట్ల (సుమారు $ 38 బిలియన్) పెట్టుబడి అవసరమైనప్పటికీ, ఇది సురక్షితమైన రవాణాకు దీర్ఘకాలిక పరిష్కారం.

ఈ విషాదాలు మన రవాణా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవడానికి ఒక మేలుకొలుపు కావాలి. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారడమే ఇప్పుడు ప్రభుత్వాల ముందున్న తక్షణ కర్తవ్యం.

వారం తరువాత మరిచిపోతాం. అభివృద్ధి వద్దు కులాలు, మతాలు, ప్రాంతాలు మాకు ముద్దు అని గుద్దులాడుకొంటాం. స్థానికంగా స్థిరపడే



ఉపాధినిచ్చే నగరాలు, ప్రాంతాల అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు అస్సలు జనం పట్టించుకోరు. కేసులు పెట్టి, అరెస్టులు చేసి, నా సలహాలతో పాలిస్తూ.. రాజకీయాలు చేస్తేనే.. మళ్లీ గెలుస్తారు లేదంటే ఇంటికే అనే చర్చలు, రచ్చలు చేస్తూ.. ఆయాసపడుతుంటాం.

2047 కు వందేళ్లు అవుతుంది దేశానికి స్వేచ వచ్చి! అప్పటికైనా అభివృద్ధి చెందిన దేశంగా ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని మారుద్దాం అనే వారి ప్రతి ఆలోచనను, లక్ష్యాన్ని తూట్లు పొడుద్దాం. ఆ బుల్లెట్ ట్రైన్లు, ప్రయాణాలు ఆరు దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసుకొన్న ఆ దేశాలను చూసి మారుద్దాం అనే నాయకత్వాన్ని వెనక్కిలాగే చర్చలకు మన విలువైన సమయం వెచ్చిద్దాం.

వారే మేధావులని లైకులు కొట్టి, షేర్లు చేద్దాం. షురూ చెయ్యండి. ఇంకా చనిపోయిన వారి గురించి వదిలేద్దాం. మళ్లీ చనిపోయే రోజున మళ్లీ వాటి మీద తీర్పులను ఇద్దాం. 2047 అనేది బూతు, మనకెందుకు? మన ఇంట్లో తరాలకు, వారసులకు సంపాదిద్దాం. ఏమంటారు?

ఢిల్లీలో డీసీసీ అధ్యక్షుల నియామకంపై ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ తో సమావేశం అయిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఎఐసీసీ ఇన్-చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ , సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి, ఎఐసీసీ సెక్రటరీ శ్రీ విశ్వనాథన్. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంఘటన్ సృజన్ అభియాన్ పురోగతి, మరియు జిల్లా స్థాయి నాయకత్వ మార్పులపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి.



# 'తెలంగాణ' కోసం 1200 మంది అమరులైతే 580 మందికే న్యాయం జరిగింది!

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణ

హైదరాబాద్, (అక్షర గళం):

తెలంగాణ అమరవీరులకు, వారి కుటుంబాలకు చేతులెత్తి క్షమాపణ కోరుతున్నా. ఏ ఆశయాల కోసం వారు ప్రాణత్యాగం చేశారో ఆ ఆశయాలు నెరవేరలేదు. 1200 మంది అమరులైతే 580 మందికి మాత్రమే న్యాయం జరిగింది. ప్రతి అమరవీరుల కుటుంబానికి కోటి రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 'జనం బాట' కు బయలు దేరే ముందు గన్ పార్క్ వద్ద అమరులకు నివాళులు అర్పించి, మాట్లాడారు.

అమరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని ప్రమాణం చేస్తున్నా.... తెలంగాణ ఉద్యమంలో అనేక మంది అమరులయ్యారు. వారి త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నాం.

ఏ ఆశయాల కోసం వారు అమరులయ్యారో వాటిని ఎంత వరకు సాధించుకున్నామో ఆలోచించుకోవాలి. పేగులు తెగేదాక కొట్లాడిన ఉద్యమకారుల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో కూడా ఆలోచించుకోవాలని హితవు పలికారు. తెలంగాణ కోసం 1200 మంది అమరులయ్యారని మనమే అసెంబ్లీ లో చెప్పాం. కాని వారికి ఇవ్వాల్సిన గౌరవం, వారి కుటుంబాలకు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వలేదు. ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు, ఉద్యోగం ఇస్తామని చెప్పాం.

కానీ 580 మందికి మాత్రమే ఇచ్చాం. మిగతా వారికి న్యాయం చేయలేదని ఆమె ఆరోపించారు.



# బిఆర్ఎస్ నేతలు ఆగం ఆగం అవుతున్నారు

- ప్రశాంత్ రెడ్డి ఇంత అజ్ఞానా?
- మీరు ఎంత అరిచి గీ పెట్టినా.. దేశానికి రోల్ మోడల్ రోడ్లు నిర్మించి తీరుతాం
- ప్రశాంత్ రెడ్డి ఆరోపణలపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్

హైదరాబాద్: హ్యామ్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే రోడ్లలో 8వేల కోట్ల స్కాం జరుగుతుందని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రశాంత్ రెడ్డి ఆరోపణలపై మంత్రి తన దైన శైలిలో సమాధానమిచ్చారు. ఇటీవల బిఆర్ఎస్ నేతల ప్రెస్టేషన్ మాటలు వింటుంటే జాలేస్తుంది. అద్దం లాంటి రోడ్లు వేస్తామంటే బిఆర్ఎస్ వాళ్ల గుండెలు అదురుతున్నాయి. పచ్చకామెర్లోడికి లోకమంతా.. పచ్చగానే కనిపిస్తుందన్నట్లు..అన్నిట్లోస్కాం లు చేసిన మీకు ఏది చూసిన స్కామే కన్పిస్తుంది

కవిత వేరే కుంపటి పెట్టుకుంది..హరీష్ రావు కొత్త పార్టీ కోసం చూస్తున్నాడు. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడే..కానీ ఇవాళ ఆయన మాట్లాడిన మాటలు చూస్తుంటే ఇంత అజ్ఞానా? అని విచారిస్తున్న. CRIF రోడ్లకు.. హ్యామ్ రోడ్ల విధానికి చాలా తేడా ఉంటుంది.. %=ఒదీ% శాఖ మంత్రిగా పనిచేసిన నీకు ఇది తెలియకపోవడం బాధాకరం.

కళ్ళద్దాలు పెట్టుకొని కూడా..0.4% ను 4% అని చదివావంటే నీ ఆరోగ్యం పై నాకు ఆందోళన కలుగుతుంది మిత్రమా? 15 సంవత్సరాల్లో ఒక్క కి.మీ మెయింటెనెన్స్ కోసం ఖర్చు చేసేది కేవలం 20లక్షల లోపే..నీకు 2కోట్లు ఎలా అనిపించింది? నేను 6 సార్లు ప్రజల ఆశీర్వాదంతో చట్టసభలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధిని..ఈ సుదీర్ఘ రాజకీయ జీవితంలో చిన్న మచ్చ(ఆరోపణ) కూడా నాపై లేదు. నేను అవినీతిని ప్రోత్సహించే వ్యక్తిని కాదు. అవినీతి జరిగితే చూస్తూ ఊరుకోను.

తెలంగాణ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధ పడ్డోడిని. నా చివరి శ్వాస వరకు తెలంగాణ ప్రజల మేలు కోసమే పనిచేస్తా. మీరు ఎంత అరిచి గీ పెట్టినా దేశానికి రోల్ మోడల్ రోడ్లు



నిర్మించి తీరుతాం. ఈ రోడ్లు గనుక పూర్తయితే వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ 10 సీట్లకే పరిమితం అవుతుందనే భయం మీకు పట్టుకుంది.

కాళేశ్వరం స్కాం,యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం స్కాం,ధరణి స్కాం,గొర్రెల స్కాం ఇలా చెప్పుకుంటూ పోతే పదేళ్ల కాలంలో మీరు చేసిన స్కాంలకు అంతే లేదని మండిపడ్డారు. కవిత వేరే కుంపటి పెట్టుకుంది..ఇవాల్టి నుండి జనాల్లోకి అంటూ వెళ్తున్నది. మరోవైపు హరీష్ రావు కొత్త పార్టీ కోసం చూస్తున్నట్లు తెలుస్తోంది అని మంత్రి అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ రోజు రోజుకు పెరుగుతుండడం, ఆ పార్టీ నేతలు చెట్టుకొకరు, పుట్టకొక్కరు అవడం చూసి చోటా మోటా బిఆర్ఎస్ నేతలు అయోమయంలో పడి ఆగం ఆగం అవుతున్నారనీ విమర్శించారు.


"మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడే..కానీ ఇవాళ ఆయన మాట్లాడిన మాటలు చూస్తుంటే ఇంత అజ్ఞానా..? అని విచారం వ్యక్తం చేస్తున్న" అని అన్నారు. CRIF లో కి.మీ1.75 కోట్లు అవుతుందన్నది సింపుల్ వైడెనింగ్ కోసం మాత్రమే.అదే హ్యామ్ మోడల్‌లో చేస్తున్నది డబుల్ లేన్ బలోపేతం. అది కూడా NHAI నార్మ్స్ ప్రకారం చేస్తున్నాం.

కి.మీ రోడ్డు మెయింటెనెన్స్ కోసం 2 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారు. ఒక్క కి.మీ రోడ్డు కోసం 6 కోట్లు అవుతుందని అసత్యాలు మాట్లాడాడని, నిజానికి 15 సంవత్సరాల్లో ఒక్క కి.మీ మెయింటెనెన్స్ కోసం ఖర్చు చేసేది కేవలం 20లక్షల లోపే. మొత్తం ఒక్క కి.మీ మీద మొత్తం కాలానికి 2కోట్ల 90 లక్షలు మాత్రమే అవుతుందని వివరించారు.

మెయింటెనెన్స్ కోసం మొదటి సంవత్సరం ప్రభుత్వం ఏమి ఖర్చు చేయదనీ..రెండో సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల వరకు 0.4% మాత్రమే చేస్తుందని, 6వ సంవత్సరంలో 0.8%,7వ సంవత్సరంలో రోడ్ రెన్యువల్ కు 2.4%, తర్వాత 8 నుండి 12 సంవత్సరాల వరకు 0.4% శాతం,13 నుండి 0.8%శాతం అని ఇలా మొత్తం 15 సంవత్సరాల్లో మెయింటెనెన్స్ కోసం అయ్యే ఖర్చు కేవలం 20 లక్షల లోపే అని మంత్రి స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన హ్యామ్ మోడల్ నిబంధనల ప్రకారం ఇంట్రెస్ట్ తో కూడిన మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చి, నిర్మాణ సమయంలోనే వడ్డీతో సహా సంబంధిత నిర్మాణ సంస్థ బిల్లుల నుండే రికవరీ చేస్తామని మంత్రి తెలిపారు.

"ఈ హ్యామ్ విధానం తెలంగాణలో కొత్తగా తెచ్చింది కాదు.. ఇది వరకే కర్ణాటక రాష్ట్రంలో 20 ఏళ్ల నుండి అమలవుతుంది. అట్లాగే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ ,ఉత్తరప్రదేశ్, తమిళ నాడు లాంటి రాష్ట్రాల్లో గత ఐదేళ్లుగా అమలులో ఉంది." అని తెలిపారు.





# 'హరే కృష్ణ కల్చరల్ సెంటర్'తో సాంస్కృతిక వారసత్వం విస్తరణ

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

హైదరాబాద్, (అక్షర గళం):

సంగారెడ్డి జిల్లా, కంది మండలంలో హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న హరే కృష్ణ కల్చరల్ సెంటర్ నిర్మాణంలో భాగంగా నిర్వహించిన మహా నరసింహా హోమం,



గర్భాలయ యంత్ర స్థాపన పూజ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ముఖ్య అతిథి గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ ... సనాతన ధర్మ మహోన్నత సాంస్కృతిక వారసత్వాన్ని , విలువలను ప్రాచుర్యంలోకి తేవటానికి అద్భుత అధ్యాత్మిక సంస్కృత కేంద్రంగా హరే కృష్ణ కల్చరల్ సెంటర్ నిలుస్తుందని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 కొత్త ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ వాహనాలను జెండా ఊపి మంత్రి దామోదర్ రాజనర్సింహా, టీజీఐఐసీ ఛైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వహిస్తున్న అతిపెద్ద కిచెన్ ను పరిశీలించారు. ఆధునిక వంట గదులను, స్నాక్స్, ఆటోమేటిక్ కూరగాయల వాషింగ్, కటింగ్ మెషిన్ లను పరిశీలించారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్‌తో సుమారు 20 ఏళ్ళకు పైగా అనుబంధం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత రాజశేఖర్ రెడ్డి సహకారం తో కందిలో దేశంలోనే అతిపెద్ద కిచన్ ను ఏర్పాటు చేశామన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ వారు ఆకలితో బాధపడే వారందరికీ మంచి భోజనం



అందించటమే లక్ష్యంగా రోజుకు 23 లక్షల మందికి పైగా మధ్యాహ్న భోజనాలను సరఫరా చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు భోజనామృతం, ఇందిరమ్మ క్యాంటిన్లు, సద్దిమూట, స్వస్థ ఆహార పథకాల ద్వారా 200 కంటే ఎక్కువ కేంద్రాల నుండి సుమారు 15 కోట్లకు పైగా భోజనాలను అందించటం చరిత్ర అన్నారు. ఇదే మాధవ సేవ అని కొనియాడారు. సమాజానికి ఏదైనా తిరిగి ఇవ్వాలనే సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. నాకు వ్యక్తి గతంగా అక్షయ పాత్ర తో ఉన్న అనుబంధం చాల గొప్పది అని మంత్రి దామోదర్ రాజనర్సింహా వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్ సత్య గౌర చందాదాస ప్రభు జీ, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రాజేందర్ లు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్,అక్టోబర్22(అక్షర గళం): నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ గురువారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ పేర్కొంది. గురువారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు



కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది.

# సంపాదకీయం..

## బీహార్‌లో వేడెక్కుతున్న రాజకీయం!

బీహార్ శాసనసభ ఎన్నికల వేళ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచారం వేడెక్కింది. ఆర్‌జెడి పరిపాలన నాటి అవినీతి గురించి వందేళ్లయినా చర్చించుకుంటారని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఆర్జెడి నేత తేజస్వి యాదవ్ ఘాటుగానే స్పందించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో బీహార్‌కు ఒరిగిందేమిటని నిలదీశారు. ఇకపోతే ఇక్కడ ఎన్నికలను ఎదుర్కొంటున్న ఇండియా బ్లాక్ మహా ఠట్‌బంధన్ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్‌ను ఏకాభిప్రాయంతో ప్రకటించి అధికార జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎకి తిరుగులేని సవాల్ విసిరింది. అయితే కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం మాత్రం కుదరలేదు. అందుకే పలుచోట్ల పరస్పర పోటీకి దిగారు. దీనికితోడు ప్రచార పోస్టర్లలో రాహుల్ బొమ్మ లేకుండా ఆర్‌జెడి ముందుకు వెళుతోంది. ఇవే అంశాలను ఎన్‌డిఎ ఎత్తిచూపుతోంది. వారిమధ్యన పొత్తులే సరిగా లేవని, అది మహాగట్‌బంధన్ ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందన్నది కూడా ముఖ్యం. పికె కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న ఈ రెండు కూటములను నిలవరించి ముందుకు రావడం కష్టమే. అలాగని హంగ్ ఏర్పడుతుందని ఎక్కడా చెప్పడం లేదు. బీహార్‌లో గత దశాబ్దంన్నర పాలనా కాలంలో నితీష్ వేసిన వేషాలు అన్నీ ఇన్నీ కావు. పదవే లక్ష్యంగా కూటములు ఫిరాయించిన చరిత్ర ఆయన స్వంతం. ఆయన విధానాన్ని బిజెపి అందివచ్చిన ప్రతిసారీ వల వేసి ఉపయోగించుకుంది. 2020 అక్టోబర్–నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా



ఘట్‌బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్‌డిఎ తీర్థం పుచ్చుకొని పదవి కాపాడుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కావాల్సిన సీట్లు తగ్గగా తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి చెబుతున్నదాంట్లో నిజం కనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని కొన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. నితీశ్‌ను నమ్మినట్ఉ కనిపిస్తున్నా..ఎప్పుడైనా మింగేందుకు సిద్దంగా ఉంది. ఈ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధిస్తే నితీశ్‌ను పక్కన పెట్టడం ఖాయమని తెలుస్తోంది. బిజెపి రాజీకయంగా వేసే ఎత్తుగడలు పలు రాష్టాల్లో్ ఇప్పటికే రుజువైంది. అందుకు తార్కాణం మహారాష్ట్రనే. సిఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ఎన్‌డిఎ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ బిజెపికి ఎక్కువ సీట్లు రావడంతో సిఎం పదవిని బిజెపి తీసుకొని కూటమి పొత్తు ధర్మానికి నీళ్లొదిలింది. అటువంటిదే బీహార్‌లో నితీష్ విషయంలో బిజెపి చేయదని గ్యారంటీ లేదు. ఇకపోతే ఎన్నికలకు ముందుగానే తమ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ అధ్యక్షుడైన ముఖేష్ సహాని పేరును సైతం ప్రకటించి ఎన్నికల సమరానికి సై అంది. అయితే ఆర్‌జెడి గత పాపాలు వెన్నాడుతున్నాయి. లాలూ హయాంలో జరిగిన కుంభకోణాలు ఎన్నో ఉన్నాయి. తమ భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో ఎలాంటి ఇబ్బందులూ లేవని డాంబికాలు పలుకుతున్న ఎన్‌డిఎ తమ సిఎం అభ్యర్థి ఎవరో ఎన్నికల అనంతరమే ప్రకటిస్తామని బిజెపి, అమిత్‌షా దాటవేస్తూ వచ్చారు. జెడియు చీఫ్, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఎ ఎన్నికలకు వెళుతోందని అంటూనే, ఈ సారి నితీష్ సిఎం అవుతారన్న గ్యారంటీ లేదని చెప్పకనే చెప్పారు. దీన్నిబట్టి నితీష్ మెడపై బిజెపి కత్తి వేలాడతీసిందని అర్థమవుతుంది.

బీహార్‌లో గెలిచేందుకు బిజెపి తొక్కని అడ్డదార్లు లేవు. ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్‌ఐఆర్)ను ప్రయోగించింది. ఇ.సి కి ఎంతమాత్రం సంబంధం లేని పౌరసత్వ నిర్ధారణ అంశాన్ని చేర్చేలా పావులు కదిపింది. దీనిపై ప్రతిపక్షాలు సుప్రీం కోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ఏకంగా 65 లక్షల ఓట్లు తొలగించారు. దీనిపై విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించినా ఇంకా పూర్తి స్థాయిలో విచారణ లేదు. ఓట్ల చోరీపై మహా గట్‌బంధన్ పెద్ద ఆందోళనే చేసింది.మహా గట్‌బంధన్‌కు సంబంధించి 11 సీట్లలో స్నేహ పూర్వక పోటీలు కొనసాగుతున్నాయి. నితీష్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని ఇప్పటికే ముందస్తు సర్వేలు చెప్తున్నాయి. బీహార్‌లో బిజెపి, దాని మిత్రులను ఓడిస్తేనే కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు కొంత మేరకైనా బ్రేకులు పడతాయని విపక్ష కాంగ్రెస్ భావిస్తోంది. ఆ లక్ష్య సాధన కోసం తమలోని చిన్న చిన్న ఇబ్బందులను పరిష్కరించుకొని మహా గట్‌బంధన్ పని చేయాలని వారు కోరుకుంటున్నారు. అయితే ఈసారి బీహార్‌లో ఎవరికీ అనుకూలంగా పరిస్థితి లేదు. అలాగే ఎవరిని ప్రజలు వ్యతిరేకిస్తున్నారో కూడా చెప్పలేక పోతున్నారు. ఈ దలు రేపటి ఎన్నికల్లో ప్రజలు ఎవరివైపు అన్నది వేచిచూడాలి.

## ఈ దశాబ్దం మోదీదే

ఈ దశాబ్దం మోదీదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు.కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు తీసుకువస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఎన్నికల హామీ 'సూపర్ సిక్స్'ను విజయవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తానని వెల్లడించారు. 'భారత్‌లో ఎంతో ఆసక్తిని కలిగించే అంశాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాని మోదీ 2000 సంవత్సరం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఎన్నికల్లో



విజయం సాధిస్తూనే ఉంటారు. గతంలో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014 నుంచి 11 ఏళ్లుగా ప్రధానిగా కొనసాగుతున్నారు. మరో నాలుగు సంవత్సరాలు ఆయనే ఉంటారు. ఈ దశాబ్దం మోదీదే. అంటే ఆటోమెటిగ్గా భారతీయులదే' అని చంద్రబాబు వెల్లడించారు. ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై చంద్రబాబు మాట్లాడారు. వాటివల్ల ప్రజల సేవింగ్స్ పెరుగుతాయని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ రంగం, ఇతర వ్యాపారవేత్తలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఏ దేశ తలసరి ఆదాయంలోనైనా ఆ దేశంలో నివసించే భారతీయులదే ఆధిపత్యం అని ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెంచేందుకు పలువురు వ్యాపారవేత్తలతో భేటీ అయ్యారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో జరిగే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. వచ్చే నెలలో ఆర్సెలార్‌మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఎలాంట్‌కు ఆంధ్రాలో శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, ఉద్యానరంగం, లాజిస్టిక్స్, రాజధాని నగరం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 750 వరకు సేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నామంటూ రియల్ టైమ్ గవర్నెన్స్ గురించి పేర్కొన్నారు. అలాగే తెలుగు కమ్యూనిటీ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఒకరోజు ఈ గ్రహంపై అత్యంత ప్రభావవంతమైన సమాజంగా తెలుగు కమ్యూనిటీ నిలుస్తుందని, ఆ దిశగా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు. గత 15 నెలల్లో తమ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సేకరించిందని, మరో రూ.5లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

# స్వాతంత్ర్యోద్యమం నేర్పిన పాఠం.. హిందూ ఐక్యత

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మహాత్మా గాంధీపట్ల రాష్ట్రీయ స్వయంసేవక సంఘం దృష్టికోణం గురించి రాజకీయ రంగంలోనూ, విద్యారంగంలోనూ నిరంతరం చర్చ జరుగుతూనే ఉంది. మహాత్మా గాంధీకి, ఆయన ప్రవచించిన గాంధేయవాద దృక్పథానికి భారతీయ సామాజిక జీవనంలోనూ, రాజకీయ జీవనం లోనూ 1920 నుండి ప్రముఖ స్థానం ఉంది.

స్వాతంత్రోద్యమ సందర్భంలో ఆయన అందరి కంటే ఎక్కువ ప్రభావాన్ని చూపించిన, అత్యంత జనాదరణ కలిగిన నాయకుడు. స్వాతంత్ర్యో ద్యమం మీద ఆయన వేసిన ముద్ర చెరగనిది. వలస పాలనలో ఉన్న భారతదేశంలో సిద్ధాంతా లను ఆధారం చేసికొని కాంగ్రెస్ ద్వారా, కాంగ్రెసుకు బయటకూడా అనేక చిన్నా, పెద్దా ఉద్యమాలు ప్రభవించాయి. ఈ ఉద్యమాలన్నిం టికీ, తమదైన ఒక దృక్కోణం ఉంది. ఈ ఉద్యమాల ప్రారంభకుల దృక్పథం, సైద్ధాంతిక మైన గుర్తింపు, కార్యక్రమాలు ఆనాటి సామాజిక, రాజకీయ వాతావరణాలను కొద్దిగానో, గొప్పగానో ప్రభావితం చేశాయి.

ఈ ఉద్యమాలపట్ల, ఈ సంస్థలపట్ల, వాటిని నడిపించిన వ్యక్తులపట్ల మహాత్మా గాంధీకి ఎటు వంటి అభిప్రాయం ఉండేది? అలాగే గాంధీజీపట్ల ఆ ఉద్యమాలకూ, ఆ సంస్థలకూ ఎటువంటి దృక్కోణం ఉండేది? ఇది చాలా ప్రాధాన్యం గల్గిన విషయం.

ఉదాహరణకు డా. భీమ్‌రావు అంబేద్కర్, గాంధీజీల మధ్య సామాజిక, రాజకీయ సమస్యల గురించి సైద్ధాంతిక వివాదాలు, గాంధీజీ ఆర్థిక విధానాలపై, సామాజిక కట్టుబాట్లపై కమ్యూనిస్టు పార్టీ చేసిన సైద్ధాంతికమైన దాడులు, విప్లవకారుల పట్ల గాంధీజీకి సానుభూతి లేకపోవటం, సుభాష్ చంద్రబోస్ రాజకీయ కార్యకలాపాల పట్ల గాంధీజీకి ఉండిన వైముఖ్యం – ఇటువంటి విషయాల మీద అనేక పరిశోధనలు జరిగాయి, వాస్తవాలను వెలికితీశారు.

కానీ, సంఘం– మహాత్మాగాంధీ మధ్య చోటు చేసుకున్న సమ్మతి– అసమ్మతి, సైద్ధాంతికమైన లేదా వ్యావహారికమైన అభిప్రాయ భేదాలు మొదలైన ప్రశ్నలు ఇప్పటికీ జవాబు దొరక్కుండా ఉండి పోయాయి. స్వాతంత్ర్యానంతరం భారతీయ రాజకీయ రంగంలో జరుగుతున్న సైద్ధాంతిక సంఘర్షణేగాక, పదవీ రాజకీయ ఘర్షణలు కూడా దీనికి ఒక ముఖ్యమైన కారణం.

కాంగ్రెసులో ఉన్నవారిలో పండిత జవాహర్‌లాల్ నెహ్రూ సోషలిస్టు. పాశ్చాత్యమైన ఆలోచనలతో ప్రభావితుడైన వ్యక్తి. కాగా వల్లభభాయి పటేల్, ఇతర నాయకులు భారతీయతలో మునిగి తేలినవారు. సైద్ధాంతికమైన ఘర్షణలలో భారతదేశంలోని కమ్యూనిస్టు మేధావులు నెహ్రూకు సన్నిహితులు.

రాజీ లేని పటేల్ జాతీయవాదం కారణంగాను, స్వాతంత్ర్యానికి ముందు జరిగిన దేశ విభజన మొదలైన ఘటనలలో పాకిస్తాన్ సమస్య, సంస్థానాల విలీనం సమస్య–ఇలా అనేక సందర్భాలలో వాస్తవికమైన అంచనాలతో వ్యవహరించిన కారణంగాను –కాంగ్రెసుకు బయట ఉన్న అనేక శక్తులు – పటేల్‌ను ప్రశంసిస్తూ ఉండేవి. వాటిలో సంఘం కూడా ఒకటి. కాబట్టి ఈ ఇరువురు జాతీయ స్థాయి నాయకులలో ఒకరిని ఎవరైనా – పార్టీ లోపలివారైనా, బయటి వారైనా సరే– సమర్థించినట్లయితే వారు రెండవ వారికి వ్యతిరేకులుగా పరిగణించేవారు.

ఆ విధంగా ఆ ఇరువురూ ఉత్తర–దక్షిణ ధ్రువాల వంటి వారని, ఒకరికి సన్నిహితులైనవారు రెండవవారికి వ్యతిరేకులే అయి తీరాలని అనుకొంటూ ఉండేవారు. గాంధీజీతో పటేల్‌కు ఎంత సాన్నిహిత్యముందో, నెహ్రూకు అంతే సాన్నిహిత్యముంది. అయినప్ప టికీ ప్రధానమంత్రి కావటం మూలంగాను, పాశ్చాత్య ఆలోచనా రీతుల సమర్థకునిగాను, నెహ్రూకు పాశ్చాత్య ప్రపంచంలోనూ, ఆంగ్ల పత్రికలలోను, కమ్యూనిస్టులైన పాత్రికేయుల లోను విశేష ఆదరణ లభించింది.

ఈ దశలో విభజన జరిగి, కాలమేఘం కమ్మినట్లు విషాదంలో మునిగి ఉన్న ఖండిత హిందూస్థాన్‌ను మరో పిడుగుపాటు తాకింది. హిందూ మహాసభతో సంబంధాలున్న కొందరు హిందూ యువకులు మహాత్మాగాంధీని దేశవిభజనకు బాధ్యునిగానూ, పాకిస్తాన్ శ్రేయోభిలాషిగానూ భావించుకొని, ఆయనను హత్య చేసేందుకు కుట్రపన్నారు.

తదనుగుణంగా 1948 జనవరి 30న నాథూరాం గోడ్సే ప్రార్థనా సమావేశంలో పిస్తోలు ప్రేల్చి గాంధీజీని హత్య చేశాడు. ఏ వ్యక్తినైతే స్వాతంత్ర్యానికి ముందు (జిన్నా, ముస్లింలీగ్‌కు చెందిన ఆయన సహచరులు మినహాగా) దేశమంతా 'మహాత్మా' అని ప్రేమగా పిలిచి గౌరవించుకుందో, ఆయన వివేకమే తమ వివేకమని ఎంచుకొని పల్లెత్తుమాట ఎదురాడక, ఆయన ఇచ్చిన కార్యక్రమా లలో కళ్లు మూసుకొని పాలుపంచుకొన్నదో ఆ వ్యక్తి హత్యకు గురికావడం యావత్తు దేశానికి తీవ్రమైన హృదయాఘాతమే. గోడ్సే పిచ్చితనంతో కూడిన చేష్టకు హిందూ మానసం నిస్సందేహంగా సిగ్గుతో తలవంచుకొనే స్థితిని అనుభవిస్తూ ఉంది.

తాను హత్యకు గురికావడానికి నాలుగు నెలల ముందు మహాత్మాగాంధీ ఢిల్లీలోని భంగీకాలనీలో సంఘ శిబిరానికి వచ్చారు. అక్కడ ఆయన ఉపన్యసించారు. స్వయంసేవకులతో ఏ విధమైన సంకోచం లేకుండా ప్రశ్నోత్తరాలు జరిగినవి. ఈ విధమైన నిస్సం కోచ వ్యవహారానికి గాంధీజీ సంతోషించారు. ఆనాటి భ్రమలతో కూడిన పరిస్థితుల మధ్య స్వయంసేవకులకూ గాంధీజీని ప్రత్యక్షంగా చూసి, అర్థం చేసికొనడానికి ఒక అవకాశం లభించింది.

అయితే ఘోరమైన గాంధీ హత్యకు నేరుగా రాష్ట్రీయ స్వయంసేవక సంఘాన్ని దోషిగా చిత్రీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం సంఘంపై నిషేధం విధించింది. ఈ సమస్య మీద కూడా ప్రధానమంత్రి జవాహర్‌లాల్ నెహ్రూ, హోంమంత్రి సర్దార్ పటేళ్ల మధ్య ఏకీభావం లేదు. పటేల్ నెహ్రూకి వ్రాసిన లేఖలో ఇలా స్పష్టంగా పేర్కొన్నారు. "ఈ పనితో ఆర్‌ఎస్‌ఎస్‌కి ఏమీ సంబంధం లేదు. ఏవైనా ఇతర కృత్యాల గురించిన, తప్పుల గురించిన బాధ్యతను నిస్సందేహంగా సంఘంపై మోపవచ్చుగాని ఈ పనికి బాధ్యతను సంఘంపై మోపలేం".

1948 ఫిబ్రవరి 4న సంఘం మీద నిషేధం విధించినపుడు సాధారణ ప్రజానీకం సంఘం గాంధీజీకి వ్యతిరేకమే అయి ఉంటుందనే అభిప్రాయా నికి లోనుకావటం అసహజం కాదు. కాగా హత్య గురించి, దాని వెనుక కుట్ర గురించి, విచారణ జరిపిన రెండు కమిషన్లు కుట్రలో సంఘానికి ఏ విధమైన పాత్రా లేదని అభిప్రాయం వ్యక్తపరిచాయి. 1949 జులై 12న కేంద్ర ప్రభుత్వం సంఘంపై నిషేధాన్ని తొలగించింది.

అయినప్పటికీ, ప్రజ లందరూ దైవసమానుడైన వ్యక్తిగా భావించి అభిమానిస్తున్న వ్యక్తిని హత్య చేశారన్న ఆరోపణ ప్రభుత్వం వైపు నుండి వచ్చిన కారణంగానూ, మార్క్సువాదులైన రచయితలు, మేధావులు తమ రచనల్లో ఈ విషయానికి ప్రచారమిచ్చి మేధోవర్గంలో ప్రవేశపెట్టిన కారణంగానూ సంఘం గాంధీజీకి వ్యతిరేకమని, హింసాత్మకమైనదని ఒక ముద్ర ఏర్పడిపోయింది. ఫలితంగా హెడ్గేవార్ ప్రతిపాదిం చిన సంఘం ఆలోచనలు – గాంధీవాదం ఇవి రెండూ పరస్పరం వ్యతిరేకమైన ఆలోచనా విధానాలన్న తీరులో చూసే ఒక భ్రమ ఏర్పడిపోయింది.

సంఘాన్ని స్థాపించడానికి ముందు తర్వాత కూడా గాంధీజీ నాయకత్వంలో జరిగిన ఉద్యమాలలో పూర్తి నిబద్ధతతో డా. హెడ్గేవార్ పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమంలో డా. హెడ్గేవార్ పాల్గొనటం ఆనాటి మధ్యప్రాంతాల తిలక్ వాదుల అభిప్రాయాలకు వ్యతిరేకం. ఆయన రాష్ట్రీయ మండలి నుండి బయటకు వచ్చి 'నాగ్‌పూర్ నేషనల్ యూనియన్' అనే సంస్థను నెలకొల్పారు. దీని వెనుక ఉన్న కారణాలలో ఒకటి– మండలిలో ఉన్నవారికి గాంధీజీ పట్ల ఉన్న వ్యతిరేకత.

డా. హెడ్గేవార్, గాంధీజీల దృక్కోణాలలో ఒక పెద్ద తేడా ఉంది. గాంధీజీ దృష్టిలో స్వాతంత్ర్యం కోసం చేసే ఉద్యమం అహింసా మార్గంలో నడవటమే సర్వోత్తమం. ఏ ఇతర మార్గాన్ని ఎవరు సూచించినా గాంధీజీకి నచ్చేది కాదు. విప్లవవీరుల ఉద్యమం పట్ల ఆయనకు ఏ మాత్రం సానుభూతి లేదు. డా?? హెడ్గేవార్ స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ సూచించిన మార్గం ఉత్తమమైనదని భావించేవారు.

సహాయ నిరాకరణోద్యమంలోనూ, శాసనోల్లంఘన ఉద్యమ సందర్భంలోనూ ఆయన, అర్ధసైనిక శిక్షణను పోలిన శిక్షణను పొందిన స్వయంసేవకులూ గాంధీజీ ప్రవచించిన అహింసకు కట్టుబడి ఉంటామనే తమ ప్రతిజ్ఞను, ఉద్యమంలో పాటించవలసిన నియమ నిబంధనలనూ, మర్యాదలనూ తు.చ. తప్పకుండా నిల బెట్టుకొన్నారు. అయితే డా. హెడ్గేవార్ ఒక విషయంలో గాంధీజీతో ఏనాడూ ఏకీభవించలేదు. ఇతర మార్గాలను అనుసరించే దేశభక్తులను గాని, వారు చేపట్టిన సాధనామార్గాల పవిత్రతనుగాని ప్రశ్నించటం డా. హెడ్గేవార్‌కు



అంగీకారంగా ఉండేదికాదు.

"స్వాతంత్ర్యం సాధించటం కోసం ఆంగ్లేయుల బూట్లకు పాలిష్ చేయటం దగ్గరి నుండి ఆరంభించి, ఆ బూట్లనే వారి కాళ్ల నుండి లాగివేసి వాటితోనే నెత్తురు ధారలుగా కారేటట్లుగా చితకబాదటం వరకు అన్ని మార్గాలూ నా దృష్టిలో స్వాతంత్ర్య ప్రాప్తికి సాధనాలే. ఏ మార్గం పట్ల నా మనస్సులో తిరస్కార భావం లేదు. ఆంగ్లేయులను వెళ్లగొట్టి దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి తీరాలన్నదే నాకు తెలుసు" అని డా. హెడ్గేవార్ అన్నారు.

ప్రజానీకంలోతెలివితేటలు, చదువు సంధ్యలూ, ఉన్నతా దర్శాలూ ఉండటంతో పాటు రాష్ట్రం శక్తిశాలి కావటంకూడా అవసరమని డా. హెడ్గేవార్ అభిప్రాయం. వెనుక 'బలం' దృఢంగా నిలబడి వెన్ను కాచి ఉన్నపుడే 'అహింస' ఏదైనా సాధించగల్గుతుంది. 'బలం' అనటంలో ఆయన ఉద్దేశం రాష్ట్రీయ చైతన్యం, ప్రజల సంఘటిత శక్తి. "బలం లేకుండా సంరక్షణ జరగదు. బలం సంఘటనలోనే ఉంటుంది. విఘటనకు దూరంగా ఉంటూ, బయట నుండి వచ్చే ఆక్రమణలను ఎదుర్కొనే సామర్థ్యం సంఘటనకు ఉండాలి" అని అన్నారు.

### ముస్లిం సమస్య

స్వాతంత్ర్యోద్యమ దినాలలో క్షేత్ర స్థాయిలో తన ప్రభావాన్ని పెంచుకొనడానికి కాంగ్రెసు యత్నిస్తూ ఉండేది. జాతీయ సంస్థ ఏదైనా సరే, అలా యత్నించాలి కూడాను. అయితే ఆనాడు కాంగ్రెసు నాయకత్వం ఎదుర్కొనవలసి వచ్చిన ఒక జటిల సమస్య – మహమ్మదీయులు జాతీయోద్యమాలకు దూరంగా ఉండిపోవటం, కాంగ్రెసును హిందూ వాదుల పార్టీగా చిత్రీకరించి దానిని దూరంగా ఉంచటమున్నూ. కాంగ్రెసు ఈ దేశ జాతీయతకు, సంస్కృతికి సరియైన నిర్వచనమిచ్చి దాని ప్రకారం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టి ఉన్నట్లయితే, మహమ్మదీయుల తటస్థ వైఖరి వేర్పాటువాదంగా మార్పు చెంది ఉండేది కాదు.

వారిని దగ్గరకు తీసికోవాలని కాంగ్రెసు ఎంతగా యత్నిస్తూ ఉందో, ముస్లింలీగ్ బేరసారాలశక్తి అంతగా పెరుగుతూ పోయింది. ముస్లిం సమాజాన్ని ఎలాగైనా జాతీయోద్యమంలో పాల్గొనేటట్లు చేయడానికై వారి కోరికలను, ఆకాంక్షలను, వారు విధించే షరతులను అంగీకరిస్తూ అన్నింటికి రాజీపడుతూ ఉండటమే తుష్టీకరణ విధానం.

1906లో ముస్లింలీగ్ స్థాపనతో దేశ రాజకీయాలలో వేర్పాటువాదానికి పునాదిరాయి పడింది. ఉద్యమ కాలమంతటా ఒకే వాస్తవం వ్యక్తమ వుతూ వచ్చింది–భారతదేశ స్వాతంత్ర్యం, మహమ్మదీ యుల అస్తిత్వం– ఇవి రెండూ వేరువేరు సమస్యలు.

హిందూ–ముస్లిం ఐకమత్యం నినాదాన్ని పదేపదే వల్లెవేయడాన్ని, దాని వెనుక దాగి ఉన్న మనస్తత్వాన్ని దోషభూయిష్టమైనవిగా డా. హెడ్గేవార్ భావించేవారు. వారు అడుగుతూ ఉండేవారు. "ఈ దేశంలో వేరే ఇతర మతాలవారు లేరా? మరి కేవలం హిందూ–ముస్లిం ఐకమత్యం గురించే ఎందుకు మాట్లాడు తున్నారు? అందరం కలసి ఉండాలని ఎందుకు మాట్లాడటం లేదు?" ధార్మికంగా వేరువేరు అభిమతాలను కలిగి ఉన్న ప్రజల జాతీయత గురించి వేరువేరు అభిప్రాయాలు ఉండరాదని ఆయన అభిప్రాయం. ఏ దేశంలోనైనా జాతీయత ఒక్కటే ఉంటుంది. కలగూరగంపగా ఉండదు. పంచకూళ్ల కషాయంగా ఉండదు. అతుకులు వేసినదిగా ఉండదు.

1935 డిసెంబరులో మధ్య ప్రాంతాలలోని వర్ధా జిల్లా ఆర్వీలో సంఘం శీతాకాల శిక్షణ శిబిరంలో డా.హెడ్గేవార్ ఉపన్యసించారు. ఈ విషయంపై అందులో వారు వివరణ ఇచ్చారు. "గాంధీజీ హిందూ ముస్లిం ఐకమత్యం గురించి మాట్లాడు తున్నారు. నేనూ అదే కోరుతున్నాను. అయితే మన దృష్టికోణం వారికి కొంచెం తేడాగా ఉంది. 'సగటు మహమ్మదీయుడు బెదిరించేవాడూ, గద్దించే వాడూ కాగా, సగటు హిందువు పిరికివాడు' అని గాంధీజీ అంటు న్నారు. మహమ్మదీయులను సంతృప్తిపరచే తుష్టీకరణ విధానం ద్వారా ఐకమత్యం సాధించాలని ఆయన కోరుకొంటున్నారు. నేను మహాభారతం నుండి ఒక శ్లోకం చెప్పదలచాను.

**యయోరేవ సమం విత్తం యయోరేవ సమం బలమ్?**
**తయో ర్వివాహో మైత్రీచ నతు పుష్ట విపుష్టయోః??**

దీని అర్థమేమంటే సమానంగా శక్తి, ధనం గల్గిన సమఉజ్జీల మధ్యనే స్నేహం, వివాహం అర్థవంత మౌతాయి. అంతేగాని బలవంతునికి బలహీనునికి మధ్య కాదు. ఆ తర్వాత ఇంకా ఇలా చెప్పారు."హిందువులతో పోల్చినపుడు తాము ఎక్కువగా సంఘటితులమై ఉన్నామని మహమ్మదీయులకు అనిపిస్తూ వారి మనసులలో ఆ భావం ఉన్నంతవరకూ ఐకమత్యం అనే ఆలోచనవారికి నచ్చదని నేను అభిప్రాయపడుతున్నాను. హిందువులు కూడా సంఘటితులై ఉన్నారని, వారు స్వాతంత్ర్యం సంపాదించుకోగల సామర్థ్యం ఉన్నవారని వారికి అర్థమైన రోజున వారంతట వారే జాతీయ ప్రవాహంలో కలసిపోతారు".

1932 ఏప్రిల్ 16న బ్రిటిష్ ప్రధానమంత్రి 'కమ్యూనల్ అవార్డు'గా ప్రసిద్ధమైన మతాలవారీ నియోజకవర్గాల ఏర్పాటును ప్రకటించినపుడు డా.హెడ్గేవార్ దానిని వ్యతిరేకించారు. "కమ్యూనల్ అవార్డు పేరుతో ఈనాడు నాటిన ఈ వేర్పాటువాద విషబీజం ముందుముందు దేశవిభజనకు కారణమౌ తుంది." హిందూ–ముస్లిం సంబంధాల సమస్యను రాజకీయం చేసే వలసపాలకుల యత్నాలను డా. హెడ్గేవార్ తీవ్రంగా వ్యతిరేకించారు.

'స్వాతంత్ర్య' పత్రిక సంపాదకునిగా ఆయన ఇలా రాశారు. "భారతదేశంలో బ్రిటిషు సామ్రాజ్యవాదం సమంజసమైనదే అంటూ సమర్థించేవారు చెప్పిన అంశాలలో హిందూ–ముస్లింల మధ్య భేదభావాలు ఒకటి. బ్రిటిషువారు ఈ దేశాన్ని వదిలి వెళ్లిపోయి నట్లయితే హిందువులు–ముస్లింలు తమలో తాము కొట్టుకొంటారు, తలలు నరుక్కుంటారు అని వారు చెప్తూ ఉంటారు. ఇదంతా తప్పు.

బ్రిటిషు సామ్రాజ్యవాదం భారతదేశంలో పాగా వేయడానికి కారణం హిందూ–ముస్లింల మధ్య కలహాలు కారణం కాదు. అంతేకాదు, వారు వచ్చిన తర్వాతనే ఈ కలహాలు– తగాదాలు పెరిగాయి. ఒకవేళ హిందూ–ముస్లింల మధ్య తగాదా ఉందని అనుకుంటే మాత్రం – అందులో జోక్యం చేసికొనే అధికారం బ్రిటిష్ వారికి ఎవరిచ్చారు?

యూరోప్‌లోని దేశాల్లో ఏ రెండు వర్గాలో కొట్టుకొంటూ ఉంటే– జోక్యం చేసికొనడానికి వారు వెళ్తారా? హిందువులు, ముస్లింలు తమ మధ్య ఉన్న సమస్యను స్వయంగానే పరిష్కరించుకొంటారు. మాతృభూమి పుత్రులైన వారి మధ్య హిందువు ఏ విధమైన భేదభావాన్ని చూపించటం లేదు. మంచి ముస్లింలు అందరూ అతని కార్యపరిధిలోకి వచ్చేవారే".

ఈ దేశంలోని హిందూ తదితర మతాలవారు ఏ జాతికి (Race) చెందినవారో, ఏ సంస్కృతి సభ్యతలకు చెందినవారో, భారతీయ ముస్లింలు కూడా చారిత్రకంగా ఆ జాతికి చెందినవారే. కాబట్టి సమానమైన నాగరికత, సంస్కృతి, ఒకే తెగ లేక జాతి (Race), చరిత్రలు కారణాలుగా భారతీయు లందరినీ ఒక జాతీయతకు చెందినవారుగా డా.హెడ్గేవార్ భావించేవారు. ఆ జాతీయతలో భాగస్వాములైన వారినే వారు 'హిందూ రాష్ట్రం' అనే పదంతో వ్యక్తీకరించారు.

డా.హెడ్గేవార్ ఇలా రాశారు."స్వరాజ్యం గురించి పోరాటం ప్రారంభమైన నాటి నుండి, హిందువులకు మహమ్మదీయులకూ మధ్య దూరం పెరిగిపోయింది. నాయకులు ఐకమత్యాన్ని కూడగట్టటంకోసం ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తూ, ప్రయోగాలు చేస్తూ వచ్చారు. కాని అవన్నీ వ్యర్థమని రుజువైనాయి. అప్పుడు వారికి ఒప్పందం ద్వారా ఐకమత్యం సాధించవచ్చునని తోచింది. బెంగాలు ఒప్పందం దాని పరిణామమే. స్వరాజ్య పార్టీవారు బెంగాలు విధాన మండలిలో అధికారి వర్గంతో తలపడినప్పుడు ఈ ఒప్పందం అర్థం ఏమిటి?

ఆంగ్లేయుల ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహమ్మ దీయులు పోరాడేటట్లుగా చేయడానికి హిందువులు మహమ్మదీయులకు కొన్ని విశేష సదుపాయాలు చేసే షరతులను అంగీకరించి తీరాలనిగదా దీని అర్థం. మరి ఈ విషయంలో కొంచెం లోతుగా ఆలోచిద్దాం. స్వరాజ్యం కావలసింది ఒక్క హిందువులకేనా? ఇది వారికి మాత్రమే సంబంధించిన సమస్యా? కాదు గదా!

ఈ సమస్య వాస్తవానికి దేశ ప్రజలందరిదీ– వారు ఏ కులంవారైనా, ఏ మతంవారైనా, ఇంకా ఏ ఇతర వర్గానికి చెందిన వారైనా సరే. అలాంటప్పుడు మహమ్మదీయులు స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొనడానికి షరతులు విధించటమేమిటి?. స్వరాజ్యాన్ని గూర్చిన అవగాహన మనలో మనం ఏ సముదాయానికైనా విశేష సదుపాయాలను, కోరే కోర్కెలను తిరస్కరిస్తుంది".

సామ్రాజ్యవాదంతో తలపడి సంఘర్షణ సాగించటం అనే ప్రయ త్నానికి ముందుగా మహమ్మ దీయుల సమస్యకు ప్రాధాన్యమివ్వాలనే ఆలోచనలను వదిలి పెట్టాలని డా. హెడ్గేవార్ భావించేవారు. ఆనాటి హింసాకాండ, మహిళలపై అత్యాచారాలు వంటి సమస్యల పరిష్కారానికి ఏదో హిందూ సైన్య సురక్షాదళం వంటి వాటిని ఏర్పరచడానికి బదులుగా హిందువులు స్వయంగా సంఘటితులై వాటిని నిరోధించాలని కోరేవారు.

హిందువులు సంఘటితు లైనపుడు వారిపై ఆక్రమణ చేయాలనే ప్రవృత్తి దానంతట అదే పరిసమాప్తమైపోతుంది. హిందూ– ముస్లిం సమస్యపట్ల గాంధీజీ, డా.హెడ్గేవార్, డా. ముంజే గార్ల దృష్టి కోణాలను ఈ విధంగా స్పష్టీకరించవచ్చు.

గాంధీజీ ముస్లింల వేర్పాటువాదాన్ని, స్వాతంత్ర్య సాధనపట్ల వారి తటస్థ వైఖరిని గమనించి వారిపట్ల ఉదారంగా, సర్దుబాట్లు–రాజీలతో కూడిన ఆచరణ ద్వారా వారి హృదయ పరివర్తన తీసికొని రావాలని కోరుతూ ఉండేవారు. డా. ముంజే, హిందూ మహాసభలోని ఇతర నాయకులు అధికసంఖ్యాకవాదం, హిందూ ఉగ్రతలను వేర్పాటువాదానికి, స్వాతంత్ర్య సాధనపట్ల తటస్థవైఖరికి సమాధానాలుగా భావించే వారు.

ఈ ఇరువురికి దూరంగా డా.హెడ్గేవార్ ఈ కీలకమైన సమస్యకు మౌలికమైన సమాధానాన్ని సూచించారు. హిందువులను సకారాత్మకంగా సంఘటితపరచటం, వారి మధ్య నెలకొని ఉన్న సామాజిక అసమానతలను రూపుమాపటం, జాతీయతపట్ల సమర్పణభావాన్ని పెంపొందించటం ఈ చర్యల సమాహారమే ముస్లింల మానసికతలో స్థిరంగా నిలిచే మార్పును తీసుకొచ్చే ఏకైకమార్గమని డా. హెడ్గేవార్ విశ్వసించారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం



## వన్డేల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన కోహ్లీ

భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్ చరిత్రలో మరో అరుదైన మైలురాయిని అధిగమించాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు చేసిన కోహ్లీ, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర రికార్డును బద్దలు కొట్టి వన్డే చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ ఘనత సాధించడం ద్వారా కోహ్లీ తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ తర్వాత నిలిచిన ఏకైక ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఆఖరి వన్డేలో మెరుపు హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా విరాట్ కోహ్లీ.. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించాడు. ఈ మ్యాచ్‌కు ముందు కోహ్లీ సంగక్కర రికార్డును బ్రేక్ చేయడానికి 54 పరుగులు చేయాల్సి వచ్చింది. కుమార సంగక్కర 404 వన్డేల్లో 14,234 పరుగులు చేశాడు. కోహ్లీ తన 293వ వన్డే ఇన్నింగ్స్‌లోనే 14,255లి పరుగులు చేసి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను అజేయంగా 74 పరుగులు చేసి, భారత్‌కు 9 వికెట్ల విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ ఇప్పుడు తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ వెనకే నిలిచాడు. సచిన్ టెండూల్కర్ 452 ఇన్నింగ్స్‌లలో 18,426 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లీ సాధించిన ఈ రికార్డుకు అతని అద్భుతమైన యావరేజ్ బలం. వన్డే చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన టాప్ 10 బ్యాటర్లలో 50 కంటే ఎక్కువ సగటు (దాదాపు 57.69) ఉన్న ఏకైక ఆటగాడు కోహ్లీ కావడం విశేషం. సచిన్ సగటు 44.83గా ఉంది. వన్డేలు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లను కలిపి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో కూడా కోహ్లీ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో 75వ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అంతేకాకుండా, ఆస్ట్రేలియాపై వన్డేలలో 2500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. రోహిత్ శర్మతో కలిసి 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత్ విజయాన్ని సులభతరం చేశాడు. తన కెరీర్ చివర్లో ఉన్నప్పటికీ, కోహ్లీ తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ తర్వాత స్థానంలో నిలిచి తన వన్డే కెరీర్‌ను ముగించే అవకాశం ఉంది.

# ఆఖరి వన్డేలో భారత్ ఘన విజయం

**టీమ్ఇండియా ఆల్ రౌండ్ ప్రదర్శన**

**38.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన భారత్**

**హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో విధ్వంసం**

**కోహ్లీ అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు**

ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను భారత్ విజయంతో ముగించింది. సిడ్నీ వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో టీమ్ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (121), విరాట్ కోహ్లీ (74) చెలరేగడంతో 237 పరుగుల లక్ష్యాన్ని భారత్ 38.3 ఓవర్లలోనే ఛేదించింది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 1 వికెట్ దక్కించుకున్నాడు. సెంచరీతో కదం తొక్కిన రోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. 237 లక్ష్య ఛేదనను రోహిత్- గిల్ ధాటిగానే ఆరంభించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (24), రోహిత్ బౌండరీలు బాదడంతో జట్టు స్కోర్ 10 ఓవర్లకు 60 దాటింది. ఈ దశలో గిల్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేశారు. ఆ తర్వాత ఆసీస్‌కు మరో వికెట్ దక్కలేదు. విరాట్ కోహ్లీతో రోహిత్ చాలా రోజుల తర్వాత భారీ పార్ట్‌నర్‌షిప్ నిర్మించాడు. ఈ ఇద్దరూ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే రోహిత్ సెంచరీ, విరాట్ హాఫ్ సెంచరీ పూర్తి చేశారు.వన్డేల్లో హిట్‌మ్యాన్‌కు ఇది 33వ శతకం కావడం విశేషం. అటు విరాట్‌కు ఇది 75వ వన్డే హాఫ్ సెంచరీ. సెంచరీ తర్వాత రోహిత్ స్పీడ్ పెంచాడు. మ్యాథ్యూ షార్ట్ వేసిన 38వ ఓవర్లో రోహిత్ సిక్స్, ఫోర్ బాదగా, ఆ తర్వాతి ఓవర్లో విరాట్ బౌండరీ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. రో- కో జోడీ ఈ ఇన్నింగ్స్‌తో అభిమానులకు ట్రీట్ ఇచ్చింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 169 బంతుల్లో 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ రేన్‌షా(58 బంతుల్లో 2 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిచెల్ మార్ష్(41), మాథ్యూ షార్ట్(30) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా(4/39) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. వాషింగ్టన్ సుందర్(2/44) రెండు వికెట్లు పడగొట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు ఆసీస్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్(29), మిచెల్ మార్ష్(41) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించిన అనంతరం సిరాజ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి పవర్ ప్లేలో ఆసీస్ వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. అనంతరం మాథ్యూ షార్ట్‌తో కలిసి మిచెల్ మార్ష్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశాడు. కానీ హాఫ్ సెంచరీకి చేరువైన అతన్ని అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేసి పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే మాథ్యూ షార్ట్(30)ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయగా.. అలెక్స్ క్యారీ(24)ని శ్రేయస్ అయ్యర్ స్టన్నింగ్ క్యాచ్‌తో హర్షిత్ రాణా ఔట్ చేశాడు. ఈ క్యాచ్ అందుకునే క్రమంలో అయ్యర్ పక్కటెముకలకు తీవ్ర గాయమైంది. ఓవైపు వికెట్లు పడినా మరోవైపు మ్యాచ్ రేన్‌షా 48 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతన్ని వాషింగ్టన్ సుందర్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. ఆ వెంటనే మిచెల్ ఓవెన్‌ను హర్షిత్ రాణా ఔట్ చేయగా.. మిచెల్ స్టార్క్‌ను కుల్దీప్ యాదవ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. నాథన్ ఎల్లిస్(16)ను ప్రసిధ్ కృష్ణ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆడమ్ జంపాతో కలిసి కూపర్ కాన్లీ కాసేపు పోరాడాడు. ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో బౌండరీలు రాబట్టాడు. అతనితో పాటు జోష్ హాజెల్ వుడ్(0)ను ఔట్ చేసిన హర్షిత్ రాణా ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 232 పరుగులు 69 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(24) మరోసారి విఫలమవ్వగా.. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది. బుధవారం నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. 237 పరుగుల స్వల్ప లక్ష్యచేధనలో టీమిండియాకు శుభారంభం దక్కింది. శుభ్‌మన్ గిల్(24) త్వరగానే ఔటైనా...

తొలి వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం లభించింది. క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీతో కలిసి రోహిత్ శర్మ చెలరేగాడు. 63 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. విరాట్ కోహ్లీ తనదైన శైలిలో చెలరేగాడు. 56 బంతుల్లో కోహ్లీ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. రోహిత్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కు 168 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు.



## ఆసీస్‌పై రోహిత్, విరాట్ విధ్వంసం

భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో అరుదైన రికార్డులు సాధించారు. వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన రెండో బ్యాటర్‌గా కింగ్ కోహ్లీ రికార్డు నెలకొల్పాడు. మరోవైపు సెంచరీతో అదరగొట్టిన రోహిత్ శర్మ తన కెరీర్‌లో 50 అంతర్జాతీయ శతకాలు పూర్తి చేశాడు. దీంతో ఆస్ట్రేలియా నిర్దేశించిన 238 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఈజీగా ఛేదించింది. ఈ క్రమంలోనే కోహ్లీ- రోహిత్ శర్మ అనేక రికార్డులు తమ బద్దలుకొట్టారు.



సెంచరీతో అదరగొట్టిన రోహిత్ శర్మకు ఓవరాల్‌గా ఇది 50వ శతకం. వన్డేల్లో అతడికిది 33వ సెంచరీ. ఈ క్రమంలోనే భారత్ తరపున ఇంటర్నేషనల్ కెరీర్‌లో అత్యధిక సెంచరీలు బాదిన మూడో బ్యాటర్‌గా నిలిచాడు. అతడి కంటే ముందు సచిన టెండూల్కర్ (100), కోహ్లీ (82) ఉన్నారు. ఇంకా ఆస్ట్రేలియాలో పర్యటిస్తూ ఆ జట్టుపై ఎక్కువ సెంచరీలు (6) చేసిన బ్యాటర్‌గానూ రోహిత్ శర్మ రికార్డ్ కొట్టాడు. ఆ తర్వాతి స్థానంలో విరాట్ కోహ్లీ (5 సెంచరీలు) ఉన్నాడు. వీటితో పాటు వన్డేల్లో వందో క్యాచ్ సైతం అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ 105 బంతుల్లోనే సెంచరీ చేసి, 125 బంతుల్లో 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.భారత్ తరపున పురుషుల వన్డేల్లో సెంచరీ చేసిన రెండో అతి పెద్ద వయస్కుడిగా రోహిత్ నిలిచాడు. ఇవాళ్టికి రోహిత్ వయసు 38 ఏళ్ల 178 రోజులు. ఈ లిస్ట్‌లో సచిన్ టాప్‌లో ఉన్నాడు. అతడు 2012లో బంగ్లాదేశ్‌పై 38 ఏళ్ల 327 రోజుల వయసులో సెంచరీ చేశాడు. వరల్డ్‌వైడ్‌గా వన్డేల్లో సెంచరీ చేసిన అతి పెద్ద వయస్కుడిగా రికార్డ్ ఖుర్రామ్ ఖాన్ పేరిట ఉంది. అతడు 43 ఏళ్ల 162 రోజుల్లో ఈ ఘనత సాధించాడు.ఇక ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ సాధించిన విరాట్ కోహ్లీ వన్డేల్లో రెండో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. ఇంతకుముందు మూడోస్థానంలో ఉన్న కోహ్లీ, ఈ మ్యాచ్‌లో కుమార సంగక్కరను (14234 పరుగులు) దాటాడు. కోహ్లీ కంటే ముందు 18426 పరుగులతో సచిన్ టెండూల్కర్ తొలిస్థానంలో ఉన్నాడు. సిడ్నీ వన్డేలో విరాట్ కోహ్లీ 56 బంతుల్లో తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 81 బంతుల్లో 74 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.



## మేం మళ్లీ ఆడుతామో లేదో తెలియదు

**రోహిత్ శర్మ సంచలన వ్యాఖ్యలు**

తాను, విరాట్ కోహ్లీ మళ్లీ ఆస్ట్రేలియా పర్యటనలో ఆడుతామో లేదో తెలియదని టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. కానీ ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన ప్రతీ క్షణాన్ని ఆస్వాదించామని హిట్ మ్యాన్ చెప్పుకొచ్చాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. ఈ విజయానంతరం దిగ్గజ క్రికెటర్లు రవి శాస్త్రి, ఆడమ్ గిల్‌క్రిస్ట్‌లతో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాకు హిట్ మ్యాన్ ధన్యవాదాలు తెలిపాడు.'నాకు ఆస్ట్రేలియా పర్యటనకు రావడం ఎప్పుడూ ఇష్టమే. సిడ్నీ వేదికగా ఆడటం సంతోషంగా ఉంటుంది. నా తొలి ఆసీస్ పర్యటన 2008 నుంచి మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ పర్యటన కూడా చాలా సరదాగా గడిచింది. మేం మళ్లీ క్రికెటర్లుగా ఆసీస్‌కు వస్తామో లేదో తెలియదు. కానీ నేను ఈ గడ్డపై ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాను. గత 15 ఏళ్లలో మేం సాధించిన ఘనతల కంటే క్రికెట్ ఆడటాన్ని ఎక్కువగా ఆస్వాదించాం. ఆసీస్ గడ్డపై ఆడటం నాకు ఎప్పుడూ ఇష్టమే. విరాట్ కోహ్లీకి కూడా ఇలానే ఉంటుందని అనుకుంటున్నాను. ఆస్ట్రేలియాకు ధన్యవాదాలు'అని రోహిత్ తెలిపాడు.ఈ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. ఈ సందర్భంగా తన ప్రదర్శన గురించి మాట్లాడిన రోహిత్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఆస్ట్రేలియా కండిషన్స్ ఎప్పుడూ ఇలానే ఉంటాయి. ఇక్కడ రాణించడం అంత సులువు కాదు. నేను సుదీర్ఘ కాలం క్రికెట్ ఆడలేదు. కానీ ఈ పర్యటన కోసం బాగా సిద్ధమయ్యాను. మేం ఈ సిరీస్ గెలవలేకపోయాం. కానీ మాకు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. యువ ఆటగాళ్లు చాలా విషయాలు నేర్చుకున్నారు.'అని రోహిత్ శర్మ తెలిపాడు.





# ఖైదీ-2 సీక్వెల్‌లో బిజీగా లోకేశ్ కనగరాజ్

దర్శకుడు లోకేష్ కనగరాజ్ చివరిగా రజనీకాంత్ హీరోగా కూలీ అనే సినిమా చేశాడు. అతని గత సినిమాలతో పోలిస్తే, ఆ సినిమా ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేదు. చెప్పుకోదగ్గ కలెక్షన్స్ వచ్చాయి, కానీ లోకేష్ కెరీర్‌లోనే అది వీకెస్ట్ వర్క్ అనే ముద్ర పడింది. ఈ సినిమా తర్వాత కమల్ హాసన్, రజనీకాంత్ కలిసి చేస్తున్న సినిమా కూడా లోకేష్ కనగరాజ్ డైరెక్ట్ చేస్తాడని అందరూ భావించారు. అయితే, అది నిజం కాదని తర్వాత తెలిసింది. అయితే, ఎట్టకేలకు మరోసారి రజనీకాంత్ అనే సినిమా చేసి హిట్ కొట్టాలని ఆయన ప్రయత్నం చేసినట్టు కూడా వార్తలు వచ్చాయి. అయితే, ఆ వార్తలన్నీ కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయి. తాజాగా అందుతున్న సమాచారం మేరకు, లోకేష్ తన తర్వాతి సినిమాగా కార్తి హీరోగా నటించిన ఖైదీ సినిమాకి సీక్వెల్‌గా ఖైదీ 2 చేయబోతున్నాడు. ఈ సినిమా లోకేష్ కనగరాజ్ సినిమాకి యూనివర్స్‌లో భాగంగా ఉండబోతోంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు మొదలైనట్లుగా అధికారిక సమాచారం. కార్తి హీరోగా వచ్చిన ఖైదీ సినిమా అప్పట్లో పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దానికి సీక్వెల్‌గా ప్లాన్ చేస్తున్నా, ఖైదీ 2 ఎలా ఉండబోతుందా అని ఆసక్తి రేగుతోంది.



# రాజా సాబ్ ప్రమోషన్‌లో కొత్త ఒరవడి

ప్రభాస్ అభిమానులకు, సినీ ప్రేక్షకులకు ఒక ఆసక్తికరమైన వార్త తెర మీదకు వచ్చింది. 'రాజా సాబ్' సినిమా విడుదలకు ముందు చిత్ర యూనిట్ మరో ట్రైలర్‌ను విడుదల చేయాలని యోచిస్తోంది. అయితే, ఈసారి ట్రైలర్ విషయంలో దర్శకుడు మారుతి ఒక సరికొత్త పద్ధతిని అనుసరించబోతున్నారు. సాధారణంగా సినిమాలలోని కీ షాట్స్‌తో ట్రైలర్ కట్ చేస్తుంటారు. కానీ, 'రాజా సాబ్' కోసం విడుదల చేయబోయే ఈ రెండో ట్రైలర్‌ను సినిమాలోని సన్నివేశాలతో కాకుండా, దీనికోసం స్పెషల్‌గా షూట్ చేయాలని దర్శకుడు మారుతి భావిస్తున్నారు. ఈ స్పెషల్ వీడియో ప్రమోషనల్ వీడియోలా ఉంటూనే, పూర్తిస్థాయి ట్రైలర్ అంత ఎఫెక్ట్‌ను కలిగించేలా డిజైన్ చేయబోతున్నారు. ఓ రకంగా చూస్తే, సినిమా ప్రమోషన్స్‌లో 'రాజా సాబ్' తో ఒక కొత్త ట్రెండ్ మొదలు కావచ్చు. అయితే ఇది పూర్తిగా కొత్త స్టాటజ్రీ అని చెప్పలేం. ఎందుకంటే సినిమా మీద ఆసక్తి కలిగించేలా ఉన్నా కొన్ని డైలాగ్స్, షాట్స్ తో చేసిన కొన్ని ట్రైలర్స్ ఇప్పటికే రిలీజ్ చేసి తర్వాత సినిమాలో అవి లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ సినిమా విషయంలో కూడా దాదాపుగా అదే స్టాటజ్రీ ఫాలో అవ్వబోతున్నారు. ఈ వినూత్న ప్రమోషనల్ స్టాటజ్రీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.



# నా దొంగ మొగుడు తెల్లటి దుస్తులు వేశాడు

## ప్రశాంత్ నీల్ దుస్తుల ఫోటోపై భార్య పోస్ట్ వైరల్

సినిమా ప్రపంచంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, ఎప్పుడూ తన సినిమాలతోనే కాదు, తన స్టైల్‌తో కూడా చర్చల్లో ఉంటారు. పుట్టింది బెంగళూరులో అయినా తెలుగు కుటుంబానికి చెందిన ప్రశాంత్ చిన్నప్పటి నుంచి టాలీవుడ్ ప్రభావంలో పెరిగాడు. ఆ ప్యాషన్‌నే ఆయన కెరీర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన దర్శకత్వం వహించిన కేజీఎఫ్ చాప్టర్ 1, 2, అలాగే సలార్ చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్‌గా నిలిచాయి. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్‌తో డ్రాగన్ వర్కింగ్ టైటిల్ పేరుతో ఓ భారీ సినిమా తెరకెక్కిస్తున్నారు. అయితే ప్రశాంత్ నీల్ సినిమాల్లో ఒక కామన్ ఫీచర్ అందరికీ తెలుసు ఆయన సినిమాలు అన్నీ డార్క్ షేడ్, ఇంటెన్స్ మూడ్ లోనే ఉంటాయి. హీరో నుంచి సపోర్టింగ్ ఆర్టిస్టుల వరకు అందరూ బ్లాక్ డ్రెస్‌ల్లో కనిపిస్తారు. షూటింగ్ లొకేషన్లు కూడా పొగతో, బొగ్గు బ్యాక్‌డ్రాప్‌లతో నిండిపోతాయి. ఈ కారణంగా అభిమానులు సరదాగా 'నీల్‌కి ఈ బ్లాక్ మీద పిచ్చేంటి?' అని కామెంట్లు చేస్తుంటారు. అయితే, ఈ సారి మాత్రం ప్రశాంత్ నీల్ తన అభిమానులను ఆశ్చర్యపరిచాడు. ఎందుకంటే ఆయన మొదటిసారి నల్ల దుస్తులు వదిలేసి తెల్ల సాంప్రదాయ డ్రెస్‌లో కనిపించాడు. ఒక కుటుంబ వేడుకలో భాగంగా అలా రెడి అయ్యారు. ఆ లుక్ చూసిన ఆయన భార్య లిఖితా రెడ్డి ఎమోషనల్ అయి, వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఫైనల్‌గా నా దొంగ మొగుడు తెల్ల బట్టలు వేసాడు అని సరదాగా రాసిన లిఖితా పోస్ట్ క్షణాల్లో వైరల్ అయిపోయింది. అభిమానులు కూడా ఆ ఫోటోపై ఫన్నీ, లవ్‌ఫుల్ కామెంట్లు పెడుతున్నారు. ఎప్పుడూ కఠినమైన, ఇంటెన్స్ లుక్‌లో కనిపించే ప్రశాంత్ నీల్ ఈ సారి సింపుల్ తెల్ల దుస్తుల్లో కనిపించడంతో, అభిమానులు 'సర్‌కి ఈ లుక్ సూపర్‌గా సూట్ అయ్యింది' అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# పురుషాధిక్యంలో మౌనమే సమాధానం

పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సిందేనని నటి జాన్వీకపూర్ అభిప్రాయపడ్డారు. తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత కరణ్‌జోహార్‌తో కలిసి జాన్వీ సందడి చేశారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు



మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. ఎంత గొప్పగా నటించే సామర్థ్యం ఉన్నప్పటికీ అవతలి వారి కోసం కొంచెం తగ్గి నటించాల్సి వస్తుంది. అలాగే మరికొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను 'ఇది నాకు నచ్చలేదు.. నేను చేయను' అని చెప్పే బదులు.. నాకు అర్థం కావడం లేదు అని చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో రాజకీయాలను ఎదుర్కోవాలని జాన్వీకపూర్ చెప్పారు. ఈ విషయాలన్నీ ఆ షో వ్యాఖ్యాతల్లో ఒకరైన ట్వింకిల్ ఖన్నా అంగీకరించారు. తాను కూడా 1990ల్లో పరిశ్రమలో ఉన్నప్పుడు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయం తనకు ఇప్పటికీ అర్థం కాదని పేర్కొన్నారు. ఇటీవల కూడా జాన్వీకపూర్ నెపోటిజం గురించి తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్-బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న 'పెద్ది'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది.

# ఆకట్టుకుంటోన్న బాహుబలి ట్రైలర్

పాన్ ఇండియాను ఊపేసిన బాహుబలి రెండు చిత్రాలు ఒక్కటిగా రాబోతున్నాయి. పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'బాహుబలి' చిత్రాన్ని మరోసారి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో అక్టోబర్



31న మూవీని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేయగా విపీరీతంగా వైరల్ అవుతోంది. ఇద్దరు మిత్రులు.. ఒక సింహాసనం, ఇద్దరు మహిళలు.. ఒక యుద్ధం, రెండు వాగ్దానాలు.. ఒక ఉల్లంఘన, రెండు చిత్రాలు.. ఒక అనుభవం పేరుతో చిత్రబృందం ఆకట్టుకునేలా ట్రైలర్‌ను తీర్చిదిద్దింది.

# ది గర్ల్ ఫ్రెండ్..అందరికీ కనెక్ట్ అయ్యే కథ

రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. ఇందులో రష్మికకు జోడీగా దీక్షిత్‌శెట్టి నటిస్తున్నారు. నవంబర్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ధీరజ్ మాట్లాడుతూ.. రష్మిక ఈ సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నారని.. విడుదలయ్యాక రెమ్యూనరేషన్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన కర్నూలు బస్సు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని రష్మిక విచారం వ్యక్తం చేశారు. జాగ్రత్తగా ఉండండి అని అందరూ చెబుతారని.. కానీ, అలాంటి పరిస్థితుల్లో మన చేతిలో ఏమీ ఉండదన్నారు. ఇక సినిమా గురించి మాట్లాడుతూ ఇది ప్రేమకథే కానీ.. ఇప్పటివరకూ ఇలాంటి కథను ఎవరూ తెరకెక్కించలేదన్నారు. చాలా సున్నితమైన కథతో దీన్ని రూపొందించారు. ఈ సినిమా కచ్చితంగా అందరికీ కనెక్ట్ అవుతుంది. నాకు బాక్సాఫీసు నంబర్లు, సక్సెస్ తెలియవు.. ఆడియన్స్‌కు మంచి కథ చెప్పాలని మాత్రమే ఆలోచిస్తాను అని చెప్పారు. రిలేషన్‌లో ఉన్నవారు ఎవరైనా ఈ సినిమాకు కనెక్ట్ అవుతారు. నిజజీవితాలకు దగ్గరగా ఉంటుందీ చిత్రం. నా టీమ్ సపోర్ట్ వల్లే ఈ సినిమాను రూపొందించ గలిగాను. ట్రెండ్‌లో ఉన్న అంశాలతోనే సినిమాలు తెరకెక్కించాలి అనే ఆలోచనను పక్కనపెట్టి ఒక మంచి కథతో మీ ముందుకు వచ్చాం. ప్రేక్షకుల సపోర్ట్ కావాలి. దీక్షిత్, రష్మిక గురించి చాలా చెప్పాలి. ఏ దర్శకులకైనా ఇలాంటి నటీనటులు దొరకడం అదృష్టం. వారి పాత్రలకు జీవం పోశారు. ఈ ఇద్దరూ ఇరగదీశారు. 13 ఏళ్ల నుంచి ఈ కథ గురించి ఆలోచిస్తున్నాను. నేను హాస్టల్‌లో ఉన్నప్పుడు జరిగిన ఓ చిన్న సంఘటన ఈ సినిమాకు పునాది. 5 ఏళ్ల క్రితం దాన్ని స్క్రీన్‌ప్లేగా రాసుకున్నాను. అది ఇన్ని రోజులకు మీ ముందుకు వచ్చిందని రాహుల్ రవీంద్రన్ అన్నారు. దీక్షిత్‌శెట్టి, రష్మిక అద్భుతంగా నటించారు. కచ్చితంగా ఈ చిత్రానికి అవార్డు వస్తుంది. రష్మిక అనడం కంటే ఇండియన్ క్రష్మిక అనాలేమో. ఈ సినిమాకు ప్రేయసితో వెళ్లే అబ్బాయిలు జాగ్రత్తగా ఉండాలి. లకైమాక్స్ అయ్యాక ఆ అమ్మాయి మిమ్మల్ని హగ్ చేసుకుంటే మీరు మంచి బాయ్‌ఫ్రెండ్.. సైలెంట్‌గా వెళ్లిపోతే మాత్రం కొట్టడం ఖాయం అని బన్నీ వాసు సరదాగా చెప్పారు.



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154